TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 175 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, మే 26, 2024 | పేజీలు : 04 | వెల రూ. 5.00/-

# ఓటమికి ఖర్గేను బలిపశువును చేస్తారు

- తరవాత ఇవిఎంలు ట్యాంపర్ అంటూ ఏడుస్తారు
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, విపక్షాలపై మోడీ విమర్శలు

**పట్నా,మే25(పీపుల్స్ మోటివేషన్):**

లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి ఓటమి ఖాయమని.. దీనికి మల్లికార్జున ఖర్గే ను కాంగ్రెస్ బలిపశువును చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఓటమి అనంతరం ఆ పార్టీ 'రాచకుటుంబం' విదేశీ పర్యటనలకు వెళ్లిపోతుందని తెలిపారు. ఎన్నికలు ముగియడానికి ముందే ప్రతిపక్ష కూటమి తన ఎగ్జిట్ పోల్స్‌తో ముందుకువచ్చింది. త్వరలో వారు ఈవీఎంలపై పడి ఏడుస్తారని ఎద్దేవా చేశారు. బిహార్‌లోని కారాకాట్, పాటలీపుత్రల్లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ పాల్గొని, ప్రసంగించారు. 'ఇండియా' కూటమి తన దాస్యాన్ని చాటుతూ.. ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకునేందుకు వారిముందు ముజ్రా నృత్యం చేస్తోందని ఆరోపించారు. ఆర్జేడీ పాలనలో రాష్ట్రంలో అపహరణలు, హత్యలు సర్వసాధారణమే. కొన్ని రాష్ట్రాల సీఎంలు బిహారీలను దుర్భాషలాడుతుంటే ఆర్జేడీ మాత్రం నోరు మెదపదు. వారి ఆత్మగౌరవాన్నీ పట్టించుకోదు. ప్రస్తుత ఎల్‌ఈడీ బల్బుల యుగంలోనూ లాంతరుతో తిరుగుతూ.. రాష్ట్రం మొత్తాన్ని చీకట్లో ఉంచి, కేవలం తన ఇంటిని మాత్రమే వెలిగిస్తోందని లాలూ గుర్తును పోలుస్తూ ఎద్దేవా చేశారు. భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చినవారు జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే. అవినీతిపరులంతా కటకటాల వెనక్కి వెళ్లాల్సిందే అని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబాన్ని ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఎస్సీలు, వెనకబడిన తరగతుల రిజర్వేషన్లను కాజేసేందుకు 'ఇండియా' కూటమి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటానని మోదీ




తెలిపారు. శక్తిమంతమైన భారత్‌కు ప్రపంచవేదికపై సరైన న్యాయం చేయగల ప్రధాని అవసరం. కానీ, ఈ పదవి విషయంలో విపక్ష కూటమి.. కుర్చీలాట ఆడాలనే ఉద్దేశంతో ఉంది. కాంగ్రెస్, ఆర్జేడీ, ఎన్‌సీపీ, సమాజ్‌వాదీ తదితర కుటుంబ పార్టీలకు చెందినవారు ప్రధానిగా కొద్దికాలం పాటు కొనసాగాలని చూస్తున్నారని విమర్శించారు.

## డ్రగ్స్ అన్న మాట వినరావద్దు

- కఠిన చర్యలు తీసుకోవాల్సిందే
- వర్షాకాలంలో ముందస్తు చర్యలకు సిద్ధం కావాలి
- కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించిన సిఎం రేవంత్
- డిజిపి, సిఎస్‌లతో పలు అంశాలపై సమీక్ష

5



## ధరలు..నిరుద్యోగమే అసలు సమస్య

**వీటిపై బిజెపి నేతలు ఎందుకు మాట్లాడరు**

**కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక సూటిప్రశ్న**

**న్యూఢిల్లీ,మే25(పీపుల్స్ మోటివేషన్):**



దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం పెద్ద సమస్యలుగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ అన్నారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ గెలుస్తుందని అన్నారు. పరిస్థితులు ఇండియా కూటమికి అనుకూలంగా ఉన్నాయన్నారు. శనివారం ఉదయం ప్రియాంక గాంధీ కుటుంబ సభ్యులుతో కలసి తన ఓటును వినియోగించుకున్నప్పుడు ఈ విషయాలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఆమ్ ఆద్మీ పార్టీకి, అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ వారు కాంగ్రెస్ కు ఓటేయడంపై మాట్లాడుతూ మా మధ్య భేదాలను మేము పక్కన పెట్టేశాం. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఒకొరికొకరం సహకరిస్తూ ఓటేకుంటున్నాం. అందుకు నేను గర్విస్తున్నాను అన్నారు. బిజెపి నాయకులు ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య తప్ప అన్ని విషయాలపై మాట్లాడుతున్నారు. దీనికి ప్రజలు విసిగిపోయారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ప్రియాంక గాంధీతో పాటు ఆమె భర్త రాబర్ట్ వాద్రా, వారి కూతురు మిరయా వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా కూడా తమ ఓటు వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు వినియోగించుకుంటున్న మిరయా వాద్రా ప్రజలు ముందుకొచ్చి ఓటేయాలన్నది నా సందేశం అన్నారు.

## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం

- ఒక్క సీటు కోసం బరిలో మొత్తం 52మంది
- 12 జిల్లాల పరిధిలోని 605 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్
- ఎన్నిక కోసం భారీగా ఏర్పాట్లు..మూతపడ్డ వైన్ షాపులు

2

## ఆరోవిడత ఎన్నికల పోలింగ్ ప్రారంభం

- 6 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు
- మొత్తంని 58 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్
- ఓటేసిన రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి సహా పలువురు ప్రముఖులు

**న్యూఢిల్లీ,మే25(ఆర్ఎన్ఎ):**



లోక్‌సభ ఎన్నికలకు ఆరో విడత పోలింగ్ శనివారం ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావడంతో ఓ టర్లు మెల్లగా క్యూలకు చేరారు. దీంతో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తుతున్నారు. దేశంలోని 6 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ నియోజకవర్గాల్లో శనివారం పోలింగ్ చేపట్టారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్ర 5 గంటల వరకు కొనసాగనుంది. కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియనుంది. ఉదయం పోలింగ్ ప్రారంభానికి ముందే ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరారు. సామాన్య ప్రజలతో పాటు పలువురు ప్రముఖులు సైతం ఓటు హక్కు వినియోగించు కున్నారు. తొలి గంటల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించు కున్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నెరవేర్చాలని ఆమె పిలుపునిచ్చారు.దేశ రాజధాని ఢిల్లీలోని ఓ పోలింగ్ కేంద్రంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ఆయన భార్య సుదేశ్ క్యూలైన్‌లో నిల్చుని ఓటు వేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఓటు హక్కు వినియోగించు కున్నారు.

## పల్నాడు ఘర్షణలో 15 సమస్యాత్మక ప్రాంతాలు

- వివిధ కేసుల్లో 666మంది నేర చరిత్ర కలిగిన వ్యక్తుల గుర్తింపు
- పల్నాడు ఎస్పీ మలికా గార్గ్ వెల్లడి

**పల్నాడు,మే25(పీపుల్స్ మోటివేషన్) :**



సార్వత్రిక ఎన్నికలల్లో ఘర్షణలు జరిగిన 15సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని పల్నాడు ఎస్పీ మలికా గార్గ్ తెలిపారు. వివిధ కేసుల్లో 666మంది నేర చరిత్ర గల వ్యక్తులను గుర్తించామని పేర్కొన్నారు. రౌడీ షీటర్ల మీద ప్రత్యేక నిఘా పెట్టామని..చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. మాచర్ల, నరసరావుపేటలో పోలీస్ భద్రతను పెంచామని చెప్పారు. బైండొవర్ కేసుల్లో ముద్దాయిలను జరిమానా విధిస్తున్నామని పేర్కొన్నారు. భారీ భద్రత అఖీఖా బలగాలతో పల్నాడులో భద్రతను పెంచామని వెల్లడించారు. ఈనెల 4వ తేదీన కౌంటింగ్ సమయం కావడంతో మరింత భద్రత పెంచామని.పల్నాడు జిల్లా లో పోలీసులంతా కౌంటింగ్ సమయంలో విధుల్లోనే ఉంటారని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు నాయకులు, పల్నాడు జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కాగా.. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈనెల 13, 14, 15 తేదీల్లో ఘర్షణలు జరిగాయి. నరసరావుపేటలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇరు పక్షాలు ఘర్షణ పడుతున్నా.. తక్కువ మంది ఉన్న పోలీసులు వీరిని నియంత్రించడానికి తీవ్రంగా శ్రమించారు. పోలీసులంతా ఎన్నికల విధుల్లో ఉండగా ఈ ఘర్షణలు పట్టణంలో తీవ్ర భయాందోళనలను కలిగించింది. మాచర్ల నియోజకవర్గంలో హింసకాండ సంభవించింది. ఈ ఘర్షణలను తీవ్రంగా పరిగణించిన ఈసీ ప్రత్యేక దర్యాప్తు బృందా ఏర్పాటు చేయగా.. మూడు రోజులు శ్రమించిన బృందం నివేదికను డీజీపీకి అందించింది. ఇదిలా ఉండగా.. ఎన్నికల కౌంటింగ్ రోజున మళ్లీ గొడవలు మొదలయ్యే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

## తీన్మార్ మల్లన్నను గెలిపించాలి: కోదండరామ్

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**



ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని తెలంగాణ జనసమితి అధినేత కోదండరాం కోరారు. ఇవాళ నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీఐ, సీపీఎం, జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ, బీఆరెస్ కు వ్యతిరేకంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మద్దతుగా నిలిచామని చెప్పారు. మార్పు కోసం అందరం కలిసి కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని జనసమితి కార్యకర్తలకు కోదండరాం విజ్ఞప్తి చేశారు.

# ఎపి వ్యాప్తంగా భారీ వర్షాలు

- పలు జిల్లాల్లో దెబ్బతిన్న పంటలు
- కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం

**అమరావతి,మే25(పీపుల్స్ మోటివేషన్):**

రాజస్థాన్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా బంగాళాఖాతం వరకూ విస్తరించిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర సహా వేర్వేరు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వైపు తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గంటకు 17 కి.మీ వేగంతో ఉత్తరదిశగా కదులుతున్నట్టు అమరావతిలోని వాతావరణ విభాగం తెలిపింది. ప్రస్తుతం ఇది పశ్చిమ బెంగాల్‌కు ఆగ్నేయంగా 480 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని స్పష్టం చేసింది. శనివారం రాత్రికి ఇది తుపానుగా మారి ఆదివారం అర్ధరాత్రికి సాగర్ ద్వీపం- ఖేపుపారా వద్ద తీరం దాటుతుందని స్పష్టం చేసింది.

2



తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# ఏపి వ్యాప్తంగా భారీ వర్షాలు

**పలు జిల్లాల్లో దెబ్బతిన్న పంటలు**

**కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం**

**అమరావతి,మే25(పీపుల్స్ మోటివేషన్):**

రాజస్థాన్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా బంగాళాఖాతం వరకూ విస్తరించిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర సహా వేర్వేరు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వైపు తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గంటకు 17 కి.మీ వేగంతో ఉత్తరదిశగా కదులుతున్నట్టు అమరావతిలోని వాతావరణ విభాగం తెలిపింది. ప్రస్తుతం ఇది పశ్చిమ బెంగాల్‌కు ఆగ్నేయంగా 480 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని స్పష్టం చేసింది. శనివారం రాత్రికి ఇది తుపానుగా మారి ఆదివారం అర్ధరాత్రికి సాగర్ ద్వీపం- ఖేపుపారా వద్ద తీరం దాటుతుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం తుపాను ప్రభావం కోస్తాంధ్ర తీరంపై లేకపోయినా ఉపరితల ద్రోణి కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాగల రెండు రోజుల పాటు ఏపీలోని కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు జల్లులు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. తదుపరి వాతావరణం పొడిగా మారుతుందని స్పష్టం చేసింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు మరింత క్రియాశీలకంగా మారాయి. అరేబియా సముద్రంలోని చాలా ప్రాంతాలకు ఇవి విస్తరించాయని.. మరింతగా పురోగమించి కేరళ తీరాన్ని ఈనెల 31 లోగానే తాకే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది.. వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ఎపిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అలాగే పలు జిల్లాల్లో వరదలు పోటెత్తాయి. అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. ద్రోణి ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అల్లూరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసాయి. అటు, విజయవాడలో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ప్రధాన రహదారులన్నీ జలమయం కాగా.. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బెంజి సర్కిల్, మొఘల్రాజపురం, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరింది. అలాగే, అనంత జిల్లా కల్యాణదుర్గంలో అత్యధికంగా 86.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పలు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రాయదుర్గం, కనేకల్, బొమ్మనహాల్ మండలాల్లో భారీ వర్షాలతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. కర్నూలు జిల్లాలోనూ ద్రోణి ప్రభావంతో భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించక మునుపే ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అటు, కాకినాడ సమీపంలోని ఉప్పాడ సముద్రం అల్లకల్లోలంగా ఉంది. శనివారం ఉదయం సుబ్బంపేట నుంచి ఎస్పీజీఎల్ వరకు సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. ఈ క్రమంలో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అటు, తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. మళ్లీ క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాబోయే 5 రోజుల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శనివారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. అలాగే, ఆదివారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వెల్లడించారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అన్నారు.

# ఓటమి భయంతోనే హింసాత్మక ఘటనలు

**అమరావతి,మే25(పీపుల్స్ మోటివేషన్) :**

పోలింగ్ సరళి చూశాక ఓడిపోతున్నట్లు వైకాపా నేతలకు అర్థమైపోయిందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఓటమి తప్పదనే దాడులు, హింసకు తెగించారని అన్నారు. అందుకే వెబ్‌కాస్టింగ్ బటన్ చంద్రబాబు చేతిలో ఉందని సాక్షిలో తప్పుడు ప్రచారం మొదలుపెట్టారని విమర్శించారు. ఇప్పటికే వైకాపా నేతలు చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లారని ఆరోపించారు. పోలింగ్ బూత్‌లో పిన్నెల్లి చేసిన విధ్వంసం గురించి ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిందన్నారు. తెదేపాకు మెజారిటీ వస్తోందని గ్రహించే ఏజెంట్లపై దాడి చేశారని విమర్శించారు. ఆ సమయంలో పట్టుకోవాల్సిన పోలీసులు.. దగ్గరుండి ఎమ్మెల్యేను కారెక్కించి పంపించారని తెలిపారు. సజ్జలకు ఈ విషయంపై మాట్లాడే ధైర్యం లేకపోయినా.. ఇంకా 144 స్థానాల్లో గెలుస్తామని ఎలా అంటున్నారని ప్రశ్నించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూర్చుకునేందుకు కూడా వైకాపా నేతలు సిద్ధంగా లేరని చెప్పారు. 'ఏ పోలీసులైతే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సలాం కొట్టారో ఆ పోలీసులే పిన్నెల్లిని బాదటానికి సిద్ధంగా ఉన్నారు. అన్నదమ్ములిద్దరూ పరార్ కాగానే మాచర్ల ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారు. బొత్స ఏం చెబుతాడో ప్రజలకు అర్థం కాదు.. ఓడి పోతామన్న వాస్తవం ఆయన గ్రహించడం లేదు' అని వర్ల పేర్కొన్నారు.

# ఘనంగా సంచిన వార్షికోత్సవాలు

**నిజామాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

పెద్దకొడప్తల్ మండలంలోని బేగంపూరండాలో గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ జై భవాని మాతా, శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ సంచిన వార్షికోత్సవాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయ ప్రదక్షణలు చేస్తూ.. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంవత్సరం వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండి ప్రజలకు, జీవరాసులకు ఇబ్బందులు కలగకుండా దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

# చార్‌దామ్ యాత్రకు రెట్టింపు సంఖ్యలో యాత్రికులు

**ఇప్పటి వరకు వివిధ కారణాలతో 56మంది మృతి**

**న్యూఢిల్లీ,మే25(పీపుల్స్ మోటివేషన్):**

మేలో ప్రారంభమైన ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు ఈసారి గతంలో కంటే రెట్టింపు సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. ఈ క్రమంలో గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్ ప్రాంతాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఈ ఏడాది మృతుల సంఖ్య కూడా పెరిగింది. ఈ యాత్ర ప్రారంభమైన 16 రోజుల్లోనే శుక్రవారం సాయంత్రం నాటికి 56 మంది యాత్రికులు మరణించారు. కేదార్‌నాథ్ ధామ్ యాత్ర మార్గంలో ఇప్పటివరకు గరిష్టంగా 27 మంది యాత్రికులు మరణించారని అక్కడి అధికారులు వెల్లడించారు. చార్‌ధామ్ బద్రీనాథ్, కేదార్నాథ్, గంగోత్రి యమునోత్రి ఎత్తైన హిమాలయ ప్రాంతాలలో ఉన్నాయి. ఇక్కడ చాలా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. దీంతో ఈ ప్రాంతాలకు వెళ్లిన యాత్రికులు ఎక్కువగా గుండెపోటునల మరణించినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ యాత్రలో మృతి చెందిన 56 మందిలో 52 మంది యాత్రికులు గుండె పోటుతో మృతి చెందడం విశేషం. మృతుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడిన వారేనని అధికారులు చెప్పారు. మరోవైపు యాత్ర మార్గంలో భక్తులకు నిత్యం సూచనలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. హెల్త్ చెకప్ సమయంలో ఆరోగ్యం బాగోలేని భక్తులను ప్రయాణం చేయవద్దని వైద్యులు కోరుతున్నారు. దీని తర్వాత కూడా ఎవరైనా యాత్రకు వెళితే రాతపూర్వకంగా ఫారం నింపేలా చర్యలు తీసుకుంటున్నారు. కాలినడకన కేదార్‌నాథ్, యమునోత్రి ధామ్‌లను అధిరోహిస్తున్నప్పుడు ఒకటి నుంచి రెండు గంటల తర్వాత ఐదు నుంచి 10 నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తున్నారు.దీంతోపాటు వెచ్చని బట్టలు, వర్షం నుంచి రక్షణ కోసం రెయిన్ కోట్, గొడుగు, పల్స్ ఆక్సిమీటర్, థర్మామీటర్ వంటివి తెచ్చుకోవాలని సూచించారు. గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఉబ్బసం, మధుమేహంతో బాధపడే యాత్రికులు అవసరమైన మందులు, వైద్యుల నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

# బెంగాల్లో బిజెపి అభ్యర్థిపై రాళ్లదాడి

- **టిఎంసి పనేనని బిజెపి ఆరోపణ**

**కోల్‌కతా,మే25(పీపుల్స్ మోటివేషన్):**

స్థానిక భాజపా నేతపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన బెంగాల్‌లోని ఝర్‌గ్రామ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గర్బెటాలోని పోలింగ్ బూత్‌లో కొందరు దుండగులు ఓటర్లను బెదిరిస్తున్నారనే సమాచారం అందుకున్న ఝర్‌గ్రామ్ నియోజక వర్గానికి చెందిన భాజపా అభ్యర్థి ప్రణత్ టుడు,ఆయన అనుచరులతో పోలింగ్ బూత్ వద్దకు వెళ్లారు. వారు అక్కడికి చేరుకోగానే కొందరు వ్యక్తులు అభ్యర్థి, ఆయన అనుచరులపై రాళ్లు రువ్వుతూ దాడికి దిగారు. ఈ దాడిలో ప్రణత్ టుడు, పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై అతడిని అక్కడినుంచి సురక్షితంగా తప్పించారు. ఈ ఘటనలో భాజపా నేత కారు ధ్వంసమైంది. కాగా దాడిపై స్పందించిన భాజపా, తృణమూల్ కాంగ్రెస్ నాయకులే ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనపై స్పందించిన టీఎంసీ నేతలు ప్రణత్ సెక్యూరిటీ గార్డు పోలింగ్ బూత్ వెలుపల ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న మహిళపై దాడి చేశాడని ఆరోపించారు. ఈ నియోజకవర్గంలో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి కలిపాడ, సీపీఐ(ఎం) అభ్యర్థి సోనామణి, భాజపా అభ్యర్థి ప్రణత్ టుడు పోటీ పడుతున్నారు. పశ్చిమబెంగాల్‌లోని పురూలియా జిల్లాల్లో ఉన్న ఝార్‌గ్రామ్ రిజర్వ్‌డ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి లోక్‌సభ ఎన్నికల ఆరోవిడతలో భాగంగా నేడు పోలింగ్ జరుగుతోంది.

# గెలిపిస్తే ప్రజల గొంతుకగా మారుతా

**ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డి**

**వరంగల్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

తనను గెలిపిస్తే ప్రజల సమస్యలపై పోరాడతానని నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. ప్రజల గొంతుకగా ప్రశ్నిస్తానని తెలిపారు. వరంగల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం నాడు రాకేశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. విద్యావంతులు, మేధావులు భవిష్యత్ గురించి ఆలోచించి తీర్పు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజలకు మంచి కోసం మేధావులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. దేశంలో చట్టసభలకు గొప్ప గొప్ప మేధావులు వెళ్లారని, ఇప్పుడు ద్రోహులు, బ్లాక్ మెయిలర్లు పోటీ చేస్తున్నారని రాకేశ్ రెడ్డి అన్నారు. ఉద్యోగులు ఎలాంటి బెదిరింపులు లేకుండా పనిచేయాలని, ప్రశాంతంగా ఎవరి వ్యాపారాలు వారు చేసుకోవాలని.., దీనికి కోసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపాలని కోరారు. ప్రజల తరఫున ప్రశ్నించే వారెవరు? ప్రభుత్వానికి తొత్తులుగా మారేవారెవరు అనేది గ్రహించాలని సూచించారు. తాను రైతు బిడ్డనని, బిట్స్ పిలానీలో గోల్డ్ మెడలిస్టునని చెప్పారు. అమెరికాలో ఏడేండ్లు ఉద్యోగం చేశానని, పుట్టినగడ్డ రుణం తీర్చుకునేందుకు సేవ చేసేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అధికారం కోసం ఎప్పుడూ పాకులాడలేదని, ఒక ఆశయంతో వచ్చినట్లు చెప్పారు. బీజేపీలో ఉన్న కార్యకర్తలు కూడా తనతో పని చేశారని అన్నారు. తాను ఏ పార్టీలో పనిచేసినా ప్రజల పక్షాన ప్రజాసమస్యల కోసం పోరాడుతానని చెప్పారు. సమాజ భవిష్యత్ కోసం ఏ నాయకుడిని ఎన్నుకోవాలనేది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆలోచించాలని కోరారు.

# ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం

**ఒక్క సీటు కోసం బరిలో మొత్తం 52మంది**

**12 జిల్లాల పరిధిలోని 605 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్**

**ఎన్నిక కోసం భారీగా ఏర్పాట్లు..మూతపడ్డ వైన్ షాపులు**

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న, బీజేపీ తరఫున ప్రేమేందర్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్ రెడ్డి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. మొత్తం 52 మంది పోటీలో ఉన్నారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రచారం ముగిసింది. 27వ తేదీ సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు 12 జిల్లాల పరిధిలోని 605 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగనుంది. మొత్తం 4,61,806 మంది పట్టభద్ర ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 287007 మంది, మహిళలు 174794 మంది కాగా ఇతరులు ఐదుగురు ఉన్నారు. మూడు పార్టీలు ఈ స్థానంలో పాగా వేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. వరంగల్-నల్లగొండ- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను గెలవడం కాంగ్రెస్‌కు ఎంత ఆవశ్యకమో.. బీఆర్ఎస్‌కు కూడా అంతే అవసరం. అసలు ఈ ఎన్నిక పల్లా రాజేశ్వరరెడ్డి రాజీనామాతో వచ్చింది కాబట్టి సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు గట్టిగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ తరఫున 12 జిల్లాల పరిధిలో పట్టభద్రుల సమావేశాలు నిర్వహించి తీన్మార్ మల్లన్న గెలుపుకోసం మంత్రులు,ఎమ్మెల్యేలు ప్రచారం చేశారు. బీజేపీ తరఫున బరిలోకి దిగిన ప్రేమేందర్ రెడ్డికి మద్దతుగా ఏకంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలనే నినాదాన్ని రెండు పార్టీలు అందుకున్నాయి. కోచింగ్ సెంటర్ల నిర్వాహకుడిగా నిరుద్యోగులకు సుపరిచితుడైన పాలకూరి అశోక్ కుమార్, ఇటీవలే కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్ కు గురైన బక్క జడ్సన్ ప్రచారం చేశారు. మొత్తానికి ఎవరి వ్యూహాలు వాళ్లకున్నాయి. పెద్దల సభలో పై చేయి సాధించాలని మూడు పార్టీలు పంతం మీదున్నాయి. మరి పట్టభద్రుల తీర్పు ఎటు అన్నది చర్చగా మారింది. ఇకపోతే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా 48 గంటలపాటు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. పోలింగ్ జరగనున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో బంద్ కానున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మే 27 సోమవారం సాయంత్రం 6 గంటల వరకు వైన్స్ మూసివేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరగని ప్రాంతంలో మాత్రం మద్యం దుకాణాలు తీసి ఉంటాయి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.కాగా మే 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. మరోవైపు జూన్ 4వ తేదీన కూడా తెలంగాణలో మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఇదే రోజు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. మే 27వ తేదీ మంగళవారం రోజున జరిగే పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4గంటల వరకు కొనసాగనుంది. పోలింగ్ రోజు ఉదయం6 నుండి సాయంత్రం 8 వరకు144 సెక్షన్ అమలు ఉంటుంది. ఇక మూడు జిల్లాల్లో మొత్తం 605 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు ఎన్నికల అధికారులు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాలల్లో మొత్తం 4 లక్షల 61 వేల 806 గ్రాడ్యుయేట్లు ఓటు వేయనున్నారు. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షా 73వేల 406 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఇక, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు.

# కెసిఆర్, కెటిఆర్ లాంటి వారు వచ్చినా గెలుపును ఆపలేరు

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో నా విజయం ఖాయమైంది**

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న**

**నల్లగొండ,మే25(పీపుల్స్ మోటివేషన్):**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్ లాంటి వాళ్ళు వంద మంది వచ్చినా తన గెలుపును అడ్డుకోలేరని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. ఒంటరిగానే తీన్మార్ మల్లన్న ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడాడని .. కాంగ్రెస్ పార్టీ తనకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందన్నారు. మే 25వ తేదీ శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లతో కాంగ్రెస్ ఎన్నికల ఆత్మీయ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న , జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి భారీగా తరలి వచ్చిన ఓటర్లు ... తీన్మార్ మల్లన్నకు ఉద్యోగ,నిరుద్యోగ సంఘాలు మద్దతు పలికారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమన్నారు. రెండవ స్థానంలో బీజేపీ, బీఆర్ఎస్ ఉండేందుకు ఒకరికొకరు పోటీ పడుతున్నారని చెప్పారు. గత పది సంవత్సరాల్లో ప్రజల పక్షాన పోరాడుతున్నందుకు తనపై పెట్టని కేసులు లేవన్నారు. ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడానని చెప్పారు. ఇప్పుడు కొంతమంది తన ఓటమి కోసం శాయశక్తుల కృషి చేస్తున్నారని అన్నారు. తీన్మార్ మల్లన్న గెలిస్తే మళ్లీ ప్రజల పక్షాన పోరాడుతాడని ... మా బండారాలు బయటపడతాయని కోపంతో కొంతమంది వ్యతిరేకంగా పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రివర్గం,ఎమ్మెల్యేలు, ప్రతిపక్షంలో ఉన్న చాలా మంది తీన్మార్ మల్లన్న ప్రజల మనిషి గెలవాలని కోరుకుంటున్నారని అన్నారు. అందరికంటే ముందుగా గ్రాడ్యుయేట్స్ ఓటర్ల దీవెనలు తనపై ఉన్నాయన్నారు. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరానని.. మళ్ళీ సొంత పార్టీలోకి వచ్చానని.. దీన్ని కూడా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తీన్మార్ మల్లన్న పై ఎలాంటి ఆరోపణలు చేయాలో తెలియక దిగజారి వ్యక్తిగత విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. తన జీవితం మొత్తం ప్రజాసేవ కోసమే అంకితమని.. ఎక్కడ ప్రజలకు అన్యాయం జరిగినా తీన్మార్ మల్లన్న కొట్లాడుతూనే ఉంటాడని అన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం । మే । 26 । 2024


# శంకుస్థాపనకే పరిమితమా.. నిర్మానానికి నోచుకునేది ఎప్పుడో.?

- అడుగు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అనే చందంగా ముందుకు కదలని కాపు భవనం నిర్మాణం పనులు
- వాగ్దానాలు.. గానాలకే పరిమితమా
- భవన నిర్మాణంపై నీలి నీడలు-బలిజల సంఘీయులు కోరిక తీరేదెప్పుడో.?
- సంఘ నాయకుల మంటూ వాస్తవాలను ప్రశ్నిస్తారనే భయంతో సంఘీయులను విస్మరిస్తూ సమావేశాలు..
- పార్టీ కార్యాలయాల్లో ప్రగల్బాలు.. వాస్తవ రూపం శూన్యం







**డోన్, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

ఓట్ల కోసం పాలకులు ఒక చేతికి తెలియకుండా మరొక చేతికి వాగ్దానం చేస్తారంటారు. నమ్మబలికేందుకు ఎన్ని విన్యాసాలైనా చేస్తుంటారు.. అదే క్రమంలో డోన్ పట్టణ బలిజ సంఘీయుల విషయంలోనూ జరిగిందనిపిస్తుంది. గత ఏడాది నవంబర్ 15వ తేదిన ఆర్థిక మంత్రి బుగ్గన హడావుడిగా శంకుస్థాపన చేశారు. అయితే నిధులు వెంటనే మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామని హామీ కూడా ఇచ్చారు. ఒక ప్రభుత్వ ఉత్తర్వు కూడా విడుదలయ్యింది. శంకుస్థాపన చేసి ఆరు నెలలు కావస్తున్నా అటక మీది.పిల్లి కదలదాయే అన్నట్లు కనీసం టెండర్లు కూడా పిలవనే లేదు. కాపుల భవనం నిర్మాణ వాగ్దాన చరిత్ర కాపు భవనం 2018లో తెర మీదకు వచ్చింది. భవన నిర్మాణం చేయాలంటూ 2018 డిశంబర్ 9వ తేదీన బలిజ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సాయి పంక్షన్ హాల్ నందు సభను నిర్వహించి రాజకీయ పార్టీకి అనుకూలంగా ఓట్ల కోసమే భవన నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న బలిజ కులం ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని కళ్లబొల్లి మాటలు చెప్పి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదే అదునుగా హడావుడిగా శిలాఫలకాలు వేశారు. అయితే అనుమతులు నిధుల కేటాయింపులో జాప్యం వెరసి దాని నిర్మాణాన్ని వెక్కిరించాయి. బలిజల కు ఎదురవుతున్న సమస్యల నేపథ్యంలో భవన నిర్మాణం చేపడతామన్న మాటతో తిరిగి కాపులకు కొత్త పుంతలు తొక్కుతూ ఆశలు చిగురించాయి. ఎట్టకేలకు గత ఏడాది నవంబర్ 15 వ తేది పట్టణ శివారులో ఊరికి దూరంగా విసివేసినట్టు కొండకు శంకుస్థాపన అయితే చేశారు. తప్ప చిల్లిగవ్వ కూడా నిధులు మంజూరు చేయలేదు. శంకుస్థాపన చేసినా నేటికీ పనులు ప్రారంభించలేదు అంటున్న బలిజ సంఘీయులు.

# పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

- పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం. ఎస్. భారతి



**పత్తికొండ, మే 25 (పీపుల్స్ మోటివేషన్):**

పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి అన్నారు. "అంతర్జాతీయ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే" సందర్భంగా శనివారం పత్తికొండ పట్టణంలోని కోర్టు ఆవరణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జడ్జి భారతి మాట్లాడుతూ... పిల్లలు చిన్న , చిన్న కారణాలతో తల్లిదండ్రులలో గొడవ పడి, ఇల్లు వదిలేసి వెళ్తున్నారన్నారు. దేశంలో, మన రాష్ట్రంలో ప్రతి ఏటా మిస్సింగ్ చిల్డ్రన్స్ కేసులు పెరుగు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిస్సింగ్ చిల్డ్రన్ కేసులలో 71 శాతం ఆడపిల్లలు ఉండటం మరింత బాధాకరం అన్నారు. ఇంట్లో నుంచి వెళ్లిన పిల్లలు బయట వేధింపు గురి అవుతున్నారని, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారి చేతుల్లో పావులు గా మారుతున్నారని అన్నారు. యుక్త వయస్సుకు వచ్చిన పిల్లల ప్రవర్తన ను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలను మంచి పౌరులుగా పెంచాల్సిన సామాజిక బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేశ్, న్యాయవాదులు మైరాముడు, ఈరన్న, రవి ప్రకాష్, బాలభాష, ప్రసాద్ బాబు, వీరేష్, లోక్ అదాలత్ సిబ్బంది రవణమ్మ, ప్రసాద్, కక్షిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డిసిసి అధ్యక్షులు



**శ్రీరంగాపూర్/వనపర్తి, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఉపాధి కూలీల పన్నులను తనిఖీ చేసి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డిసిసి అధ్యక్షులు శ్రీరంగాపూర్ జెడ్పీటీసీ రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ఈ కార్యక్రమంలో సోప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగాపూర్ మండలం హిందూ వాహిని నూతన కమిటీ ఎన్నిక



**శ్రీరంగాపూర్/ వనపర్తి, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో హిందూ వాహిని నూతన కమిటీ వేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యువ వాహిని ప్రముఖ్ శరత్ గౌడ్ మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను కాపాడే బాధ్యత ఈ దేశం లో ఉన్న ప్రతి ఒక్క యువతదే అనే విషయం మనం గుర్తించాలి దేశం అభివృద్ధి జరగాలంటే గ్రామాలు అభివృద్ధి జరగాలి దాని కోసం గ్రామాల్లో ఉన్న యువత మొత్తం సోదర భావం తో మెలిగి హిందూ ఐక్యత చాటలి అంతే కాకుండా సమాజాన్ని నాశనం చేయడానికి కొంత మంది హిందూ యువకులను చెడు దారి పట్టేలా చేస్తున్నారు మనం జాగ్రత్తగా ఉంటూ మన గ్రామాల్లో యువత నీ కూడా జాగ్రత్తగా చూసుకోవాలి బయటి దేశం నుండి ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులను గమనించాలి అని సూచించడం జరిగింది. తదనంతరం ఈ కమిటీ నిర్వహణ లో జిల్లా సంపర్క్ ప్రముఖ్ అశోక్ మండల కన్వీనర్ మోహన్ యాదవ్ కో కన్వినర్ ఉరకొండ విష్ణు యువ వాహిని ప్రముక్ భరత్, నవీన్, పవన్, తిరుమలేశు, నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ రెండోసారి కూడా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డే

- ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేస్తాం మండల కో కన్వీనర్ సి.కబీర్



**దేవనకొండ, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవనకొండ మండలంలోని వైఎస్ఆర్సిపి పార్టీ మండల కో కన్వీనర్ సి కబీర్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేరే విధంగా చూసిన మన జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడం మన బాధ్యత అని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మరియు మ్యానిఫెస్టోను 99 శాతం నెరవేర్చాడని మరొకసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి స్థానంలో చూడాలని మరియు ప్రతి సంక్షేమ పథకం ప్రతి పేదవాడి కి చేరే విధంగా జగన్మోహన్ రెడ్డి చూస్తాడని తెలియజేశాడు వైసిపి ప్రభుత్వం 125 స్థానాలు ఎమ్మెల్యే మరియు 22 స్థానాలు ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు మా యొక్క ప్రభుత్వం గుంటూరు కృష్ణ నెల్లూరు జిల్లాల తప్ప మిగతా పది జిల్లాల్లో ఎక్కువ మెజార్టీ వస్తుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ సి కబీర్ న్యాయవాది డైరెక్టర్ సొసైటీ, పి రామాంజనేయులు, మరియు తపాల రామాంజనేయులు పాల్గొన్నారు.

# రైతులకు సుస్థిర వ్యవసాయ సామాగ్రి పంపిణీ




**పత్తికొండ, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సుస్థిర వ్యవసాయానికి సంబంధించిన సామాగ్రిని శనివారం కర్నూలు జిల్లా పత్తికొండలో ఏపిఎం.మధుబాబు, సుధాకర్, అందజేశారు. స్త్రీ శక్తి భవనం ఆవరణంలో సుస్థిర వ్యవసాయం కింద ఎస్సీ కార్పొరేషన్ నుంచి వచ్చిన రెండు డ్రమ్ములు, తార్పాల్ పట్టాలనురైతులకు పంపిణీ చేశారు.

# ఫర్టిలైజర్ షాపుకు లైసెన్స్ లేకపోతే సీజ్ చేయబడును

- వ్యవసాయ అధికారి ఏవో సురేష్ బాబు



**దేవనకొండ, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవనకొండ కేంద్రం అగ్రికల్చర్ ఆఫీసులో మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాల సంబంధిత విత్తన డీలర్లను తనిఖీ చేయడం జరిగిందని. తనిఖీలో భాగంగా నకిలీ విత్తనాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే విత్తన లైసెన్స్ లేనివారు లూజు విత్తనాలు గాని, మరి ఇతర విత్తనాలు అమ్మిన ఎడల వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. మండలంలోని విత్తన డీలర్లు అందరూ సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ ఉంటేనే విత్తనాలు విక్రయించవలెను లేనిచో వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని విత్తన, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్లు అందరూ కూడా 30.06.2024 వ తేదీ లోపల ప్రొప్రైటర్ ఎవరైతే ఉంటారో ఎంప్లాయ్ కూడా వారే ఉండాలి, వారికి ఆలోపు సర్టిఫికెట్ లేనిచో వారి లైసెన్స్ లను రద్దు చేయబడును అని సూచించారు. దేవనకొండ మండలంకు ఖరీఫ్ సీజన్ సంబంధించి వేరుశనగ విత్తనాలు 2800 క్వింటాళ్లు మంజూరు కావడం జరిగింది. ఇదివరకు దాదాపు 1500 క్వింటాలు రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు రిజిస్ట్రేషన్ చేయించి అవసరమైన వారికి విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది. మండలంలో ఫర్టిలైజర్, పెస్టిసైడ్, సీడ్స్ లైసెన్సులను అర్హత కలిగిన వారికి లైసెన్సులను మంజూరు చేయడం జరుగుతుంది. అదేవిధంగా నేను ఫర్టిలైజర్ దుకాణాల లైసెన్సుల కోసం ఎవరు దగ్గర ఎలాంటి నగుదు తీసుకోలేదన్నారు. అర్హత లేని వారికి లైసెన్సులు ఇవ్వడం కుదరదు. ఎటువంటి లావాదేవీలు ఇవ్వడానికి ఏమీ ఉండదు వారు లైసెన్స్ కావాలని వచ్చిన వారు అర్హత కలిగినచో వారికి మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే కొన్ని పత్రికల్లో నకిలీ విత్తనాల గురించి ముందుగానే వ్రాయడం చాలా సంతోషంగా ఉందని నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారస్తులు అమ్మడానికి అవకాశం లేకుండా పోతుందని దీనివల్ల రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఉంటుందని ముందుగానే పేపర్ లో వచ్చినందుకు విలేకరులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# హోదాను మరచి మోడీ విమర్శలు

**ప్రధాని ముజ్రా వ్యాఖ్యలు**
**ఘాటుగా స్పందించిన ప్రియాంక**

**లక్నో,మే25(పీపుల్స్ మోటివేషన్):**

ప్రధాని మోడీ తన హోదాను మరచి విమర్శలు చేయడం దారుణమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా విమర్శలు గుప్పించారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి చేయాల్సిన విమర్శలేనా అని అమె ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బిహార్ ర్యాలీలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ విపక్షాలపై విరుచుకుపడ్డారు. 'ఇండియా' కూటమి తన దాస్యాన్ని చాటుతూ.. ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకునేందుకు వారిముందు ముజ్రా నృత్యం చేస్తోందని ఘాటు విమర్శలు చేశారు. వీటిపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రధాని పదవి మర్యాద పాటించాల్సిన బాధ్యత ఆయనకు లేదా? అని మండిపడ్డారు.'బిహార్ ఎన్నికల ప్రచారంలో విపక్షాలపై ప్రధాని మోదీ అభ్యంతరకర భాషను ప్రయోగించారు. ప్రతిపక్ష నేతలను దారుణంగా అవమానించారు. చరిత్రలో ఏ ప్రధాని అయినా ఇలాంటి పదాలు ఉపయోగించారా? ప్రధాని పదవి మర్యాదను పాటించాల్సిన బాధ్యత ఆయనకు లేదా? ప్రధాని హోదాను మేం చాలా గౌరవిస్తాం. కానీ ఈ ఎన్నికల్లో మోదీ అసలు స్వరూపం బయటపడింది. ఈ దేశ ప్రజలకు ప్రతినిధిని అన్న విషయాన్ని ఆయన మర్చిపోతున్నట్లున్నారు. ఇలాగైతే భావితరాలు మన గురించి ఏం చెబుతాయి?' అని ప్రియాంక ధ్వజమెత్తారు. ప్రధాని వ్యాఖ్యలను ఇతర విపక్ష నేతలు కూడా ఖండించారు. రాజ్యాంగపరమైన ఉన్నత పదవిలో ఉన్న మోదీ తన మాటలపై నియంత్రణ కోల్పోతున్నారని, ఇది దురదృష్టకరమని ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

## పోలీస్ తనిఖీలు 10 మోటర్ సైకిళ్లు సీజ్ మూడు లీటర్లు నాటుసారా స్వాధీనం





**పత్తికొండ, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

ఇటీవల రాష్ట్రంలో 2024 జనరల్ ఎలక్షన్స్ ముగిసిన తర్వాత అనేక గ్రామాల్లో పట్టణాల్లో శాంతి భద్రతల విఘాతం కలిగించే అనేక సంఘటనలు జరిగిన దృష్ట్యా డిజిపి మరియు ఎస్పీ యొక్క ఉత్తర్వుల మేరకు పత్తికొండ డిఎస్పి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో శనివారం పత్తికొండ మండలంలోని అత్యంత సమస్యత్మక గ్రామమైన అటికలగుండు గ్రామం నందు పత్తికొండ టౌన్ సిఐ కే మురళీమోహన్, రూరల్ సీఐ, రూరల్ ఎస్సై తుగ్గలి, జొన్నగిరి, మద్దికేర, పత్తికొండ మరియు సిబ్బంది అందరూ కలిసి గ్రామంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించడమైనది. దీనిలో భాగంగా 3 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేయడం మరియు రికార్డ్స్ లేని 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇటీవల గ్రామంలో జరిగిన కొన్ని గొడవలు దృష్ట్యా గ్రామ ప్రజలందరికీ మీటింగ్ నిర్వహించి ఏదైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు అని ప్రజలకు తెలియజేస్తూ ప్రజలందరూ కూడా ఎలక్షన్ ఫలితాలు వచ్చిన తర్వాత ఎటువంటి గొడవలు లో పాల్గొనవద్దని అలా పాల్గొన్నట్లయితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ ఇస్తూ ప్రజలందరూ పోలీస్ లకు సహకరించాలని చెప్పి మీటింగ్ నిర్వహించడం జరిగినది.

## నందికొట్కూరులో అక్రమ అడ్మిషన్లు: డి సోమన్న




**నందికొట్కూరు, మే 25 (పీపుల్స్ మోటివేషన్):-**

నందికొట్కూరు పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి .సోమన్న ఆదివారం డిమాండ్ చేశారు. సోమన్న మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థ ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ అడ్డంగా దోచుకో తింటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి నారాయణ స్కూల్ యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో నారాయణ స్కూల్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కోశాధికారి సి. అశోక్, నవనీత్, సూరి, దుర్గన్న, మహబూబ్ బాషా, షఫీ, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## 50వేల లంచం తీసుకుంటూ దొరికిన సిఐ

**కోనసీమ,మే25(పీపుల్స్ మోటివేషన్):**

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం పోలీస్ స్టేషన్ పై ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు జరిపిన ఆకస్మిక దాడులలో టౌన్ సిఐ ఆంజనేయులు 50వేల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా పట్టుపడ్డాడు. ఇక ఈ విషయం సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గడిచిన నెలలో దొరికిన కోడిపందాల నిందితుడు లక్ష్మణ్ రాజు వద్ద నుండి సీఐ 50 వేల లంచం డిమాండ్ చేశారని తెలిపారు. దాంతో బాధితుడు గతి లేని పరిస్థితులలో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలోనే ఏసీబీ అధికారులు ఓ పథకం ప్రకారం.. శనివారం నాడు పోలీస్ స్టేషన్ లో లంచం తీసుకుంటుండగా టౌన్ సిఐని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మెగా డిఎస్సీ పేరుతో కాంగ్రెస్ దగా

- **నిరుద్యోగులకు టోపీ పెట్టే యత్నాలు**
- **బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**




జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు అని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మోసాలు జరుగుతున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏడాదిలో ఇస్తామన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్-1 కింద 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే.. దాన్ని రద్దు చేసి కొత్తగా 60 పోస్టులు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. దాన్ని కొత్త నోటిఫికేషన్ అంటున్నారు. 50 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తమన్నాడు. తాము 5,089 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దాన్ని కూడా రద్దు చేశారు. అయితే 50 వేల ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తదని అనుకుంటే.. 5,089 పోస్టులకు అదనంగా మరో 5913 కలిపి 11 వేల ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చిందేమీ లేదు. ఇవ్వకపోగా 2 లక్షల ఉద్యోగాల మాట తుంగలో తొక్కారు. జాబ్ క్యాలెండర్ అతిగతి లేదు. 4 వేల నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క పచ్చి అబద్ధం చెప్పారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షలకు రూపాయి కూడా ఫీజు తీసుకోనని రేవంత్ అన్నాడు. టెట్ ఫీజును 400 నుంచి 2 వేలు చేశాడు. ఇది వాస్తవం. ఇంకో దారుణం ఏంటంటే.. మేం కష్టపడి పరిశ్రమలు తెస్తే..వాటిని రేవంత్ పాతరేస్తున్నాడు. ఫార్మా సిటీ పేరిట 12 వేల ఎకరాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్ పెట్టి, ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 లక్షల ఉద్యోగాల సృష్టికి రంగంమంతా సిద్ధం చేస్తే దానిని కూడా రేవంత్ రద్దు చేశారు. ఫార్మా సిటీని పక్కనపెట్టి.. రియల్ ఎస్టేట్ చేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు.

## 5 నిముషాల ముందు కూడా రిజర్వేషన్

**రైల్వే శాఖ తాజా సమాచారం**

**న్యూఢిల్లీ,మే25(పీపుల్స్ మోటివేషన్) :**

కొన్ని గంటల ముందు ప్రయాణం నిర్ణయమైన వారికి ఐదు నిమిషాల ముందు ట్రైన్ టికెట్ బుక్ చేసుకునే వెసులు బాటు రైల్వేశాఖ కల్పించింది. అంతవరకు బుక్ అయిన టికెట్లలో ఖాళీ ఉంటే రైలు బయల్దేరడానికి ఐదు నిమిషాల ముందు కూడా టికెట్ బుక్ చేసుకోవచ్చని చెబుతోంది. అనేక కారణాలతో ప్రయాణం రోజునే టికెట్ క్యాన్సిల్ చేసుకొనేవారు చాలా మంది ఉంటారు. అలాంటి సందర్భాల్లో ఖాళీగా ఉన్న టికెట్లను విక్రయించేందుకు రైల్వేశాఖ ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది. ప్రతిట్రైన్ టికెట్ బుకింగ్ కోసం రైల్వేశాఖ రెండు చార్ట్‌లను ప్రిపేర్ చేస్తుంది. ఫస్ట్ ఛార్ట్ అనేది రైలు బయలుదేరడానికి 4 గంటల ముందు ప్రిపేర్ అవుతుంది. రెండో ఛార్ట్ రైలు స్టార్ట్ అవ్వడానికి ముందు రూపొందిస్తారు. గతంలో అరగంట ముందు వరకు మాత్రమే టికెట్ బుకింగ్‌కు అనుమతించేవారు. ఇప్పుడు రైలు బయల్దేరడానికి ఐదు నిమిషాల ముందు వరకు వెసులు బాటు కల్పించారు. కాబట్టి ట్రైన్ స్టార్ట్ అయ్యే ఐదు నిమిషాల ముందు కూడా టికెట్లు అందుబాటులో ఉంటే ఆన్‌లైన్ / ఆఫ్ లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. మొదట సీట్లు ఖాళీ ఉన్నాయా లేదా తెలుసుకోవాలి. దీనికోసం ముందుగా ఐఆర్‌సిటిసి యాప్ ఓపెన్ చేసి ట్రైన్ సింబల్‌పై క్లిక్ చేస్తే , ఛార్ట్, వేకెన్సీ సదుపాయం కనిపిస్తుంది. లేదా నేరుగా ఆన్‌లైన్ ఛార్ట్ వెబ్‌సైట్ లోకి వెళ్లి చెక్ చేయొచ్చు. అక్కడ ట్రైన్ పేరు/ నంబర్ , తేదీ , ఎక్కాల్సిన స్టేషన్ వివరాలు ఎంటర్ చేసి 'గెట్ ట్రయిన్ ఛార్ట్ 'పై క్లిక్ చేయాలి వెంటనే తరగతుల వారీగా అందుబాటులో ఉన్న ఖాళీ సీట్ల వివరాలు కనిపిస్తాయి. సీటు ఉంటే టికెట్ బుక్ చేసుకోవచ్చు. సీటు లేకుంటే సున్నా చూపిస్తుంది. కోచ్ నంబర్ , బెర్త్ , మొత్తం వివరాలు అక్కడే కనిపిస్తాయి. ట్రైన్ ప్రారంభం అయ్యే స్టేషన్లలో ఎక్కేవారికే ఈ ఆప్షన్ ప్రయోజనకరంగా ఉంటుంది.

## మహిళా మెడికల్ ఆఫీసర్లకు లైంగిక వేధింపులు

- **కామారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై వేటు**

**కామారెడ్డి,మే25(పీపుల్స్ మోటివేషన్):**

లైంగిక వేధింపుల కేసులో కామారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై సస్పెన్షన్ వేటుపడింది. మహిళా మెడికల్ ఆఫీసర్లను లైంగికంగా వేధించినట్లు తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యాధికారి తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్, ఎస్పీతో పాటు వైద్యశాఖ ఉన్నతాధికారుల కు ఇటీవల 20 మంది మహిళా వైద్యాధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన వైద్యశాఖ విచారణకు కూడా ఆదేశించింది. ఈ క్రమంలో రాష్ట్ర వైద్యాధికారి అమర్ సింగ్ నాయక్ బుధవారం నాడు కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తమను డీఎంహెచ్‌వో ఏ విధంగా ఇబ్బంది పెట్టారన్న విషయాన్ని మహిళా ఉద్యోగులు ఆయనకు వివరించారు. దీంతో లక్ష్మణ్‌సింగ్‌పై వివిధ సెక్షన్ల కింద మొత్తం ఏడు కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళా మెడికల్ ఆఫీసర్లను లక్ష్మణ్ సింగ్ వేధిస్తున్నాడని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు.

## దాడి విషయంలో పులివర్తిది హైడ్రామా

- **అతిగా చేసారని ఆరోపించిన చెవిరెడ్డి**

**తిరుపతి,మే25(పీపుల్స్ మోటివేషన్):**

తనపై దాడి విషయంలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నాని డ్రామా చేశారంటూ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మీడియాకు వీడియో ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'నామినేషన్ రోజు నాపై దాడి చేశారు. మహిళా యూనివర్సిటీ వద్ద నాని కారుపై దాడి చేశారే తప్ప, ఆయనపై దాడి చేయలేదు. కానీ దాడిని నేను కూడా ఖండిస్తున్నాను. దాడి తరవాత కూడా నాని చాలా హుషారుగా ఉన్నారు. కానీ చేతులకు, కాళ్ళకు గాయాలు అని డ్రామాలు ఆడారు. నాని భార్య సైతం ఇదే తరహాలో లేని గాయాలు సృష్టించి డ్రామాలు ఆడుతున్నారు. పులివర్తి నాని పై దాడి విషయంలో అనవసరంగా మమ్మల్ని దోషులు చేస్తున్నారు. నాని ఆడిన డ్రామాల వల్ల ఇప్పుడు ఎంతో మంది అధికారులు, నేతలు ఇబ్బంది పడుతున్నారు. తిరుపతి లాంటి పుణ్యక్షేత్రంలో ఇలాంటి దాడులు సరికాదు. న్యాయశాస్త్రంలో పట్టా పొందిన వాడిని హుందాగా వ్యవహరిస్తాను. ఈ ఐదేళ్లు నన్ను ఎంత దూషించినా నేను స్పందించలేదు. పులివర్తి నాని దంపతులను నేను ఏనాడూ విమర్శించ లేదు. ఈ ఐదేళ్లు వారిపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.' అని ఆయన ఉద్ఘాటించారు. నాని చేస్తున్న క్వారీ వ్యాపారాల జోలికి తాను ఎప్పుడూ వెళ్లలేదని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. 'నాని భార్య మమ్మల్ని వ్యక్తిగతంగా ఎన్నో దూషించారు. రెండేళ్ల ముందు నియోజకవర్గాన్ని వదిలేద్దామని అనుకున్నాను. కానీ చంద్రగిరి ప్రజలతో ఏర్పడ్డ అనుబంధాన్ని వదలలేక, నా కుమారుడిని బరిలో నిలిపాను.' అని వ్యాఖ్యానించారు. కాగా.. పోలింగ్ రోజు చంద్రగిరిలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. టీడీపీ, వైసీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వుకున్న విషయం తెలిసిందే. ఈఘటనపై సీరియస్ అయిన ఈసీ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సైతం ఏర్పాటు చేసిన విషయం విదితమే. తాజాగా కౌంటింగ్ రోజు కూడా ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాగం చర్యలు తీసుకుంది. విజయోత్సవ ర్యాలీలకు సైతం అనుమతి లేదని స్పష్టం చేసింది.

## నకిలీ విత్తనాలతో జాగ్రత్త

**గద్వాల,మే25(పీపుల్స్ మోటివేషన్):**

నకిలీ విత్తనాలు కొని రైతులు నష్టపోవద్దని ఐజ మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ సూచించారు. మండల పరిధిలోని యాపదిన్నె గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏఈఓ అరవింద్ ఆధ్వర్యంలో శనివారం విత్తనాల కొనుగోలు పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు ఉండి, గుర్తింపు ఉన్న నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ఒరిజినల్ బిల్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండలు

**ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదు**

**వర్షాలు తగ్గుముఖంతో మారిన వాతావరణం**

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు..ఎండలు దంచి కొడుతున్నాయి. మళ్లీ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో రాబోయే ఐదురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24గంటల్లో వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఇక నైరుతి రుతుపవనాలు నైరుతి బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలో మిగతా ప్రాంతాలకు విస్తరించాయని అమరావతి వాతావరణ విభాగం పేర్కొంది. రాబోయే 24గంటల్లో నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల మీదుగా ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఈస్ట్ సెంట్రల్ బంగాళాఖాతంపై ఏర్పడిన తీవ్ర అల్పపీడనం గత ఆరుగంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో దాదాపు ఉత్తరం వైపుగా కదులుతోందని.. పేర్కొంది. ఉత్తర వైపు కదులుతూ సాయంత్రం నాటికి తూరు మధ్య కదులుతూ ఆదివారం ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా మారి అర్ధరాత్రి సాగర్ ద్వీపం, ఖేపుపరా మధ్య బంగ్లాదేశ్, ఆనుకొని పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని పేర్కొంది.

# ఆరో విడతలో.. చెదురుముదురు ఘటనలు

**57.70 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ వెల్లడి**

**న్యూఢిల్లీ,మే25(పీపుల్స్ మోటివేషన్):**

లోక్‌సభ ఎన్నికల పక్రియలో భాగంగా శనివారం ఉదయం మందకొడిగా మొదలైన 6వ విడత పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ 57.70 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ తెలిపింది. పశ్చిమబెంగాల్లో అత్యధికంగా 77.99 శాతం పోలింగ్ నమోదు కాగా, జమ్మూకశ్మీర్ లో అత్యల్పంగా 51.35 శాతం నమోదైంది. ఢిల్లీలో 53.73 శాతం, బీహార్‌లో 52.24, జార్ఖండ్‌లో 61.41, ఉత్తరప్రదేశ్‌లో 52.02, ఒడిశాలో 59.60, హర్యానాలో 55.93 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ డాటా తెలిపింది. ఢిల్లీలోని మొత్తం 7 లోక్‌సభ నియోజకవర్గాలు, హర్యానాలోని 10, బీహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 8, ఒడిశాలో 6, జార్ఖండ్‌లో 4, ఉత్తరప్రదేశ్‌లోని 14 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరిగింది. జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరిలోనూ ఈరోజు పోలింగ్ ముగిసింది. ఆరో విడత పోలింగ్ ముగియడంతో ఇంకా మిగిలిన 57 లోక్‌సభ స్థానాలకు ఏడో విడత ఎన్నికల్లో భాగంగా జూన్ 1న పోలింగ్ జరుగుతుంది. దీంతో ఎన్నికలు పూర్తవుతాయి. జూన్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

# రాజ్‌కోట్ గేమ్‌జోన్‌లో భారీ అగ్నిప్రమాదం

- **బాలుడు సహా 16మంది దుర్మరణం**
- **కొనసాగుతున్న సహాయక చర్యలు**
- **మృతుల సంఖ్య పెరిగే అవకాశం**

**రాజ్‌కోట్,మే25(పీపుల్స్ మోటివేషన్) :**

గుజరాత్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజ్‌కోట్‌లోని టీఆర్పీ గేమ్ జోన్‌లో శనివారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో చిన్నపిల్లలతోపాటు చాలా మంది వ్యక్తులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఓ బాలుడు సహా 16మంది చనిపోయినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నాలుగు ఫైరిరజన్లతో మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటల్లో చిక్కుకున్నవారిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ ప్రమాదంలో దాదాపు 22మంది సజీవదహనమయ్యారని.. పలువురు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఓ మహిళ కూడా ఉన్నట్లు చెప్పారు. క్షతగాత్రులకు తక్షణ చికిత్స కోసం వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సంఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘటనపై గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైె వైద్యం అందించాలని సూచించారు. మృతుల్లో చిన్నారులు ఉన్నట్లు సమాచారం రావడంతో పలువురు ఆందోళనకు గురయ్యారు. ఇంకా పలువురు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపిన తర్వాత ప్రమాదానికి గల కారణాలు వెల్లడిస్తామని రాజ్‌కోట్ పోలీస్ కమిషనర్ రాజు భార్గవ్ తెలిపారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు.

## రైలుకింద పడి ప్రేమజంట ఆత్మహత్య

**వరంగల్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

వరంగల్ రైల్వే స్టేషన్ కు సమీపంలో ఓ ప్రేమజంట రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సారధి నగర్ కు చెందిన ఐలపోగు సుష్మా (17) అనే యువతి, వరంగల్ కాశిబుగ్గ కు చెందిన చెన్నకేశవ అనే యువకుడు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఏడు మోరీల వద్ద నవజీవన్ ఎక్స్ ప్రెస్ కిందపడి సుష్మా, చెన్నకేశవ ఆత్మహత్యకు పాల్పడ్డారు. యువతి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతడు కూడా చనిపోయినట్టు సమాచారం. రెండు మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. సుష్మా కనిపించడంలేదని ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుల కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత ఏ కారణంగా ఆత్మహత్యకు చేసుకున్నరనే విషయాలు బయటకు వస్తాయన్నారు. ఐఒఎం.మల్లయ్య, ఎస్ఐ, ఆర్పీ, వరంగల్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రేమ వ్యవహారానికి పెద్దలు అడ్డుచెప్పడంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# చైనా ఆక్రమణలపై నోరు మెదపరేం

- **హిమాచల్ ఎన్నికల ప్రచారంలో ఖర్గే విమర్శలు**

**సిమ్లా,మే25(పీపుల్స్ మోటివేషన్):**

భారత్‌లోని భూభాగాలను చైనా ఆక్రమించడాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. ఆ దేశం మన ప్రాంతాలను ఆక్రమించినా.. ప్రధాని ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హిమాచల్ ప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న ఖర్గే.. మోదీపై విమర్శలు గుప్పించారు. నాటి భారత ప్రభుత్వం పాకిస్థాన్‌తో పోరాడి బంగ్లాదేశ్‌కు స్వాతంత్య్రం తెచ్చిపెట్టింది. భారత్ భూభాగాలను చైనా ఆక్రమించింది. ఇక్కడ రోడ్లు, ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. అయినా.. ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారు. ఇప్పుడు మీ 56 అంగుళాల ఛాతీ ఎక్కడ ఉందని ఖర్గే ప్రశ్నించారు. 2023లో హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వరదలు వచ్చిన సందర్భాన్ని గుర్తు చేస్తూ.. మోదీ సర్కార్‌పై ఖర్గే విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. వరదలతో హిమాచల్ అతలాకుతలమైంది. నాడు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల సాయం కోరినా కేంద్రం స్పందించకపోవడం బాధాకరం. రాజ్యాంగం, దేశ ప్రజలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వంలో ఉన్న 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తాం అని హామీ ఇచ్చారు.

# ఇసి వెబ్‌సైట్‌లో పోలింగ్ శాతం వివరాలు

- **ఈసికి ఆదేవాలపై ఎడిఆర్ అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ,మే25(పీపుల్స్ మోటివేషన్):**

లోక్‌సభ ఎన్నికల తొలి అయిదు దశలకు సంబంధించి నమోదైన ఓట్ల వివరాలను ఎన్నికల సంఘం విడుదల చేసింది. నియోజకవర్గాల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల గణాంకాలను తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. దేశంలో ఎన్నికల పక్రియకు హాని కలిగించేలా ఒక క్రమపద్ధతిలో తప్పుడు కథనాల వ్యాప్తి, దుర్మార్గపు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈసందర్భంగా ఆరోపించింది. పోలైన ఓట్ల సంఖ్యలో మార్పులు చేయడం అసాధ్యమని మరోసారి స్పష్టంచేసింది. ఓటింగ్ పూర్తయిన 48 గంటల్లోగా ప్రతీ పోలింగ్ కేంద్రం వారీగా ఓటింగ్ శాతాలను ఈసీ వెబ్‌సైట్‌లో ఉంచాలని అభ్యర్థిస్తూ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)' సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పటికే అయిదు దశల పోలింగ్ ముగిసి.. మరో రెండు దశలు మాత్రమే మిగిలిఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో దీనిపై ఈసీకి ఆదేశాలు జారీ చేయలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకున్నవారి కచ్చితమైన సంఖ్యను వెల్లడించేందుకు 'ఓటర్ టర్నవుట్' డేటా ఫార్మాట్‌ను మరింత విస్తరించాలని నిర్ణయించినట్లు ఈసీ తెలిపింది. మొత్తం ఓటర్ల సంఖ్య, నమోదైన పోలింగ్ శాతం ద్వారా ఎంతమంది ఓటేశారనేది తెలుసు కోవచ్చని పేర్కొంది. ఈ రెండు వివరాలు ఇప్పటికే ప్రజల వద్ద అందుబాటులో ఉన్నాయని గుర్తు చేసింది. పోలింగ్ శాతాన్ని విడుదల చేస్తున్న ఈసీ.. నమోదైన ఓట్ల సంఖ్యనూ వెల్లడించాలని డిమాండ్లు వస్తోన్న నేపథ్యంలో ఈమేరకు స్పందించింది.

# డ్రగ్స్ అన్న మాట వినరావద్దు

- **కఠిన చర్యలు తీసుకోవాల్సిందే**
- **వర్షాకాలంలో ముందస్తు చర్యలకు సిద్ధం కావాలి**
- **కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించిన సిఎం రేవంత్**
- **డిజిపి, సిఎస్‌లతో పలు అంశాలపై సమీక్ష**

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా చేయాలని భావించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌కు సీఎం హోదాలో తొలిసారి రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లారు. కమాండ్ కంట్రోల్‌లో ఉండే అధికారులు విధులు, ఇతర అంశాలపై సమీక్షిస్తుంచినట్లు తెలుస్తోంది. నార్కోటిక్స్ బ్యూరో పనితీరుపై ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో డ్రగ్స్ అనే పదం వినిపించకూడదు అని ఆదేశించారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే యువతపై డ్రగ్స్, మత్తు పదార్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. నార్కోటిక్స్ బ్యూరోకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకబడ్జెట్ కేటాయించింది. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు అరికట్టడంతో పాటు అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించి చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఇటీవల బెంగళూరు శివారులో జరిగిన రేవ్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. టాలీవుడ్ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు ఆ పార్టీలో డ్రగ్స్ వినియోగించారని బెంగళూరు పోలీసులు ప్రకటించడంతో ఈ సమీక్షపై ఉత్కంఠ నెలకొంది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి కమాండ్ కంట్రోల్‌కు వచ్చిన ఆయనకు సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి సెక్యూరిటీ వింగ్, డ్రగ్స్ కంట్రోల్ వింగ్‌లను సీఎం పరిశీలించారు. అధికారుల విధుల గురించి తెలుసుకుని, వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నార్కోటిక్స్ బ్యూరోకు బడ్జెట్ కేటాయించిన నేపథ్యంలో దానిపై చర్చించారు. డ్రగ్స్ నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్లోనే ఇతర విభాగాల అధికారులతోనూ సీఎం సమీక్ష చేపట్టారు. రాబోయే వర్షాకాలానికి సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చించారు. పోలీస్, ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, వాతావరణశాఖతో పాటు ఇతర విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# రూ.800 కోట్లు అక్రమంగా వసూలు: బిజెపి

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

రైసు మిల్లర్లు, బిడ్డర్లతో ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుందని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంపై అదనంగా రూ.800 కోట్లు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు.'మిల్లర్లకు ఇచ్చిన 90 రోజుల గడువు దాటినందుకు ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలి. 1.59 లక్షల టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వమే బిడ్డర్లకు అమ్మింది. మళ్లీ అధిక ధరకు బిడ్డర్ల నుంచి సన్నబియ్యం కొనడం ఎందుకు? అని ప్రశ్నించారు.

# సొంతవారికే.. ఐఎఎస్ ప్రమోషన్లు

- **అడ్డగోలుగా జాబితా తాయరు**
- **వెంటనే ఆపాలన్న టిడిపి నేత దేవినేని**

**అమరావతి,మే25(పీపుల్స్ మోటివేషన్):**

జగన్ రెడ్డి కనుసన్నల్లో అయినవారికి ఐఏఎస్ పదవులు కట్టబెట్టేందుకు సీఎస్ జవహర్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి అడ్డగోలుగా జాబితా తయారు చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా ఆరోపించారు. సొంత జిల్లాల వారికి పదవులు కట్టబెట్టేందుకు ప్లాన్ వేశారన్నారు. జవహర్ రెడ్డి పంపిన ప్రతిపాదనలు ఎన్నికల కోడ్ కు విరుద్ధంగా ఉన్నాయన్నారు. అర్హత ఉన్నవారికి తెలియకుండా నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. అడ్డగోలు నియామకాలను అడ్డుకోవాలని సీఈసీని, సంబంధిత అధికారులను చంద్రబాబు కోరారినట్లు తెలిపారు. భోగాపురంలో రిజల్ట్ కు ముందే పేదల భూములు కొట్టేసేందుకు ప్లాన్ వేశారని ఆరోపించారు. కాగా.. ఈ అంశంపై టీడీపీ నేత శుక్రవారం యూపీఎస్సీ ఛైర్మన్ కు లేఖ రాశారు. రాష్ట్ర కేడర్ అధికారులను ఐఏఎస్ లుగా ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ప్రతిపాదనలు పంపడం నిబంధనలకు విరుద్ధమని ఆయన లేఖలో పేర్కొన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు ఉన్నందు వల్ల ఐఏఎస్‌ల కన్ఫర్మేషన్ పక్రియ చేపట్టడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. మొండితనంతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లే అవుతుందని లేఖలో పేర్కొన్నారు. జాబితా కూడా నిబంధనల ప్రకారం రూపొందించలేదని లేఖలో ప్రస్తావించారు. ఈ పదోన్నతుల జాబితాలో ఉన్నవారు కూడా కేవలం సీఎంఓలో ఉన్నవారే మాత్రమే అని గుర్తు చేశారు. తాజాగా ఈ నియామకాలపై మరోసారి టీడీపీ నేత, మాజీ మంత్రి ఉమా ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిశాకే పదవులు ఇవ్వాలని వ్యాఖ్యానించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



## జనసునామీతో తీవ్ర నష్టం !

భారతదేశ జనాభా అధికారికంగా 140కోట్లు..అప్పనంగా వచ్చి చేరిన వారు, లెక్కలు సరిగా కట్టకపోవడం కలిపితే ఇంకో ఐదారు కోట్లు చేరుతుంది. ఇంతమంది జనాభాకు ఎన్ని తిండిగింజలు అవసరం అవుతాయి.. ఎన్ని రకాల పప్పుధాన్యాలు, నూనెలు ఎంత అవసరమో అన్నది ముఖ్యం. అలాగే వీరందరికీ గూడు కూడా ముఖ్యమే. కానీ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా జనాభాకు తగ్గట్లుగా ప్రణాళికలు వేయడం లేదు. అలాగే ఈ మానవులను ఉపయోగించి అద్భుతాలు సృష్టించవచ్చని కూడా ఆలోచించడం లేదు. కేవలం కొందరిని గుర్తించి వారికి వండివార్చడమెలా అన్నదే ఆలోచిస్తున్నారు. అలా వండివార్చడం వెనకా పరామర్థం ఉంది. వారంతా ఓటు వేస్తారన్న నమ్మకంతో ఇలాంటి వంటావార్పులు అంటే..పథకాల పేరుతో పందేరాలు చేస్తున్నారు. అంతేగానీ మానవవనరులను ఉపయోగించి దేశానికి ఎలా పునాదులు వేయాలో అన్న ఆలోచనలు నేతల్లో కానరావడం లేదు. ఐదేళ్ల పదవీకాలం కోసం పోరాటం.. ఆ తరవాత మరో ఐదేళ్లకు ప్రణాళికలతో భారత ఎన్నికల తంతు సాగుతోంది. అందుకే మనదేశంలో చదువుకున్న వారికి ఉద్యోగాలు రావడం లేదు. చదువుకోలేని వారికి ఉపాధి దక్కడం లేదు. ఉచితాలు పొందేవారు హాయిగా ఉంటున్నారు. ఇలాంటి చర్యల కారణంగా దేశం ఏటేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి, అడుగులు ముందుకు వేయడం లేదు. చైనాతో పోలిస్తే..మానవ వనరుల వినయోగంలో భారత్ ఎప్పుడూ వెనకబడే ఉంటోంది. మానవ వనరుల వినయోగానికి సంబంధించి సరైన ప్రణాళికలు ప్రభుత్వం వద్ద లేవు. దేశంలో ఉన్న సహజ వనరులతో పాటు మనావ వనరులను జోడించాలన్న ఆలోచన ఏ ప్రభుత్వానికి కూడా లేకుండా పోయింది. ద్రవ్యోల్బణం,ప్రపంచ వ్యాప్తంగా మాంద్యం, అంతర్జాతీయంగా భౌగోళికంగా, రాజకీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు వంటి సమస్యలున్నా భారత్ తన జనాభాను ముఖ్యంగా యువతను సరైన విధంగా వినియోగించుకుంటే అద్భుతమైన ప్రగతిని నమోదు చేయవచ్చు. అంతర్జాతీయ సంస్థలు, నిపుణులు కూడా దీనిని విశ్లేషిస్తున్నారు. అయితే ఉపయోగం మాట అలా వుంచితే జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయి. మనదేశంలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంటున్నది. ప్రభుత్వపరంగా ఎదురవుతున్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల కూడా పెద్ద సంఖ్యలో అవిద్య, ఆకలిదప్పులకు లోనవుతున్నారు. పెరిగిపోతున్న వృద్ధ జనాభాకు అవసరమైన వైద్య చికిత్సలను అందించటం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పలు ధనిక దేశాల్లో ఇప్పుడు ఈ సమస్య ఉన్నది. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకైతే ఈ వ్యయాన్ని భరించటం దాదాపుగా అసాధ్యం అనే చెప్పాలి. దీంతో మన దేశంలో జనాభా వృద్ధి తప్ప అభివృద్ధి కానరావడం లేదు. నేటికి ఆకలి దప్పులు, అనారోగ్యం తప్పడం లేదు. రాజకీయ వ్యవస్థ మాత్రమే బాగు పడుతోంది. తమకు అనుకూలంగా చట్టాలు చేసుకోవడం, అవసర మైతే తుంగలో తొక్కడం అన్న చందంగా మన వ్యవస్థ సాగుతోంది. భారతదేశ జనాభాలో సగం మంది 30 ఏండ్లలోపు వారే అని గణాంకాలు చెబుతున్నాయి. అంటే, దాదాపు 72 కోట్ల మందితో కూడిన యువశక్తి ఉన్న దేశం మనది. ప్రపంచంలో ఏ దేశం వద్దా ఇంతటి యువశక్తి లేదు. సరైన విద్యను అందించటం ద్వారా, ఉద్యోగ నైపుణ్యాల కు సంబంధించి నిరంతర శిక్షణ ఇవ్వటం ద్వారా యువశక్తి ప్రతిభ సామర్థ్యాలను దేశం ఉపయోగించుకోవచ్చు. అందుకు మనదగ్గర సహజవనరులకు కూడా కొదువ లేదు. భూమి,నీరు పుష్కలం గా ఉన్నాయి. వీటిని వినియోగించుకుంటే దేశం ఎంతగానో పురోగ మిస్తుంది. చైనాను అధిగమించి భూగోళం మీద అత్యధిక జనాభా రికార్డు సృష్టించామని చెప్పుకునే ముందు దానితోపాటు వచ్చే సమస్యల పైనా దృష్టిపెట్టాలి. ఆ సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమవుతాయి. ప్రజలకు నాణ్యతతో

కూడిన జీవనాన్ని ఇవ్వటానికి అవసరమైన ధృఢమైన నిర్ణయాలు, మెరుగైన విద్య, వైద్యం, నైపుణ్యాలు, ఉద్యోగాలు అవసరమవుతాయి. వీటన్నింటిపై ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తుల స్థాయిలో సమగ్రమైన కార్యాచరణ జరుగాలి. అయితే అధిక జనాభా ఉండటం కూడా సమస్యే తప్ప మరోటి కాదు. దానితో ఉండే సమస్యలు దానికున్నాయి. జనాభాను దేశానికి పరిమితమైన అంశంగా కాక, అంతర్జాతీయంగా ప్రభావం చూపే అంశంగా గుర్తించాలి. జనాభాకు తగ్గట్టుగా ఆహారధాన్యాలు, ఆవాసాలు, గాలి,నీరు అవసరం కూడా. ముఖ్యంగా వాతావరణ మార్పులు కీలకమైనవి. భూమ్మీద జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న సవాళ్లపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రతికూల వాతావరణ మార్పుల వల్ల ప్రజల వలసలు రానున్న రోజుల్లో విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉన్నదని ఈ సంస్థ చెప్తున్నది. అధిక జనాభా వల్ల నివాసయోగ్యమైన ప్రాంతాలు కుదించుకుపోతున్నాయి. దీవులు, తీరప్రాంతాలు మునిగిపోతున్నాయి. మనుగడ కోసం వన్యప్రాణులకు, మనుషులకు మధ్య ఘర్షణ పెరిగే ప్రమాదం ఏర్పడుతున్నది. అడవుల నరికివేత, కొండలు, గుట్టలు కొట్టేయడం వల్ల పర్యావరణ సమతులతులత్య దెబ్బతింటోంది. మంచి నీళ్లు, గాలి తగ్గుతున్నాయి. ఇవన్నీ ఏవో కాకిలెక్కలు కావు. ప్రపంచ వ్యాప్తంగా తరచూ వెలువడుతున్న పరిశోధనల నివేదికలు, అధ్యయనాలు చేస్తున్న హెచ్చరికలు. అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ వీటిని విస్మరించ రాదు. కచ్చితంగా వీటిపై అధ్యయనం జరిపి, తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఏ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అధికా జనాభా విస్ఫోటనంలో మనం ముదున్నాం. చైనాను అధిగమించాం. దీనిని కట్టడి చేసకోవాల్సి ఉంది. జనాభా నియంత్రణ అన్నది యుద్ధప్రాతిపదికన సాగాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్థిక వృద్ధి రేటు దాదాపు ఆరు శాతంగా నమోదవుతున్నది. మార్పుల కారణంగా కావచ్చు..ఆహార లభ్యత కావచ్చు..ఉన్నత జీవన ప్రమాణాలు కావచ్చు.. గత శతాబ్ద కాలంలో ఔషధ రంగంలో చోటుచేసుకుంటున్న అత్యాధునిక మార్పుల వల్ల కావచ్చు..మానవ జీవితకాలం దాదాపు రెట్టింపయ్యింది. 2019లో దేశ జనాభాలో అరవై ఏండ్లు లేదా అంతకన్నా ఎక్కువ వయసున్న వారు పది శాతమే. కానీ, 2050 నాటికి వారి సంఖ్య 19.6 శాతానికి పెరుగుతుంది. అంటే, మరో 25 ఏండ్లపాటు మన వద్ద తిరుగులేని యువశక్తి ఉన్నప్పటికీ, వృద్ధుల సంఖ్య కూడా తక్కువేమీ ఉండదు. వీరి సంఖ్య దాదాపు 30 కోట్లకు చేరుకుంటుంది. వీరందరికీ మంచి జీవనాన్ని కల్పించటం సవాల్ లాంటిదే. ఇకపోతే తాజా అంచనాల ప్రకారం ఆయుః ప్రమాణం మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని అంటున్నారు. తరచూ ఏదో ఒక చికిత్స తీసుకునే వృద్ధ జనాభాతోనే తమకు ఎక్కువ లాభం కాబట్టి, మానవ ఆయుః ప్రమాణం పెరుగుదల లో ఔషధరంగం పాత్ర కూడా లేకపోలేదన్న వాదనలున్నాయి. పెరుగుతున్న జనాభా వల్ల భూమి, అడవులు, జల వనరులు, గాలి వంటి సహజ వనరులపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది. ఇప్పటికే పర్యావరణ సమస్య తీవ్రంగా ఉంది. ఇవన్నీ ప్రభుత్వాలు తీవ్రంగా అధ్యయనం చేయాల్సిన అంశాలు. అప్పుడే మన సమస్యలను మనం పరిష్కరించుకోగలమని పాలకులు గుర్తించి నడుచుకోవాలి.

# టిడిపి మహానాడుకు సెలవు

**ఎన్నికల ఫలితా నేపథ్యంలో రద్దు**
**కేవలం జెండా పండగలతోనే ఈయేడు సరి**

**విజయవాడ,మే25(పీపుల్స్ మోటివేషన్):**

ఏటా మేనెల 27, 28 తేదీల్లో టిడిపిమహానాడుకు భారీగా ఏర్పాట్లు జరిగేవి. మూడ్రోజులపాటు అట్టహాసంగా మహానాడు సాగేది. దివంగత ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడు సాగేది. ఎన్టీఆర్ ఉన్నప్పటి నుంచే ఇది మొదలయ్యింది. టిడిపి అధికారంలో ఉన్నా, లేకున్నా మహానాడులో ఎలాంటి లోటులేకుండా సాగేది. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఈ తేదీలకు నాలుగు రోజుల తరవాత ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయి. దీంతో టిడిపి శ్రేణులంతా కౌంటింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సి రావడంతో ఈ యేడు మహానాడును వాయిదా వేశారు. కేవలం గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, రక్తదానాలు వంటివి చేయాలని టిడిపి అధినాయకత్వం నిర్ణయించింది. గతేడాది తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వేదకయ్యింది. ఏటా మహానాడు పర్వదినం సందర్భంగా జిల్లాలన్నీ పసుపుమయం అయ్యేవి ప్రతి ఇంటి నుంచి జనం తరలి రావాలని ఇచ్చిన పిలుపు ఇచ్చేవారు. నేపథ్యంలో ఎవరికి వారు పసుపు తోరణాలు, ఫెక్సీలు, జెండాలు ఏర్పాటు చేసేవారు. మహానాడు కార్యక్రమాలు నిర్వహించడానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు సిద్దం చేసేవారు. ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ అభిమానులు మహానాడుకు తరలివచ్చే విధంగా ఆర్టీసీ బస్సులను సమకూర్చేవారు. అయితే ఈ యేడు ఎన్నికల కారణంగా ఆ సంబరాలు నిర్వహించడం లేదు. కేవలం జెండా పండగలకే పరిమితం కాబోతున్నారు. అధికారంలోకి వస్తే అంతకు మించి అన్నట్లుగా మహానాడు జరగడం ఖాయం.

## వానాకాలం సాగుకు సన్నద్ధం

**ముందస్తు రుతపవనాల రాకతో అప్రమత్తం**
**వరితో పాటు ఆరుతడి పంటలకు ప్రోత్సాహం**

**నిజామాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ యేడాది రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే వచ్చే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారులు పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేసేపనిలో ఉన్నారు. రైతుల సాగుకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో వరిసాగు ఎక్కువగా ఉన్నందు వల్ల ఈ పంటను అత్యాధునిక పరిజ్ఞానంతో పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఖర్చు తగ్గించి ఎక్కువ దిగుబడి వచ్చే పద్ధతులను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వరితో పాటు ఆరుతడి పంటలను కూడా ఎక్కువమొత్తంలో సాగయ్యే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వానాకాలంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటల కాలనీ ఏర్పాటులో భాగంగా వరి సాగులో అత్యాధునిక పద్దతులను రైతులు అవలంబించేవిదంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వరిలో విత్తనాలు వెదజల్లే పద్ధతిని ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నారు. వానకాలం సీజన్‌లో సరిపడా విత్తనాలు, ఎరువులను సమకూరుస్తునే సీజన్ ప్రారంభానికి ముందే అన్ని క్లస్టర్‌ల పరిధిలో రైతులకు అత్యాధునిక పద్ధతులను వివరించేం దుకు ఏర్పాట్లను చేస్తున్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొన్ని రకాల విత్తనాలు సరఫరా చేస్తున్నామని, ఇతర విత్తనాలను ప్రైవేట్ విత్తన సంస్థల ద్వారా కొనుగోలు చేసుకోవాలన్నారు. వానకాలం సీజన్‌లో ఏ పంటలు ఎక్కువగా పెరగనున్నాయో యాక్షన్ ప్లాన్‌లో పొందుపర్చారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రైతులకు ఆరుతడి పంటల సాగును వివరించడంతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటలకు అనుగుణంగా విత్తనాలను సమకూర్చాలని ప్రభుత్వానికి పంపిన ప్రణాళికల్లో పేర్కొన్నారు. జిల్లాలో పత్తి సాగును కొత్తగా మొదలుపెడుతున్నందు వల్ల అవసరమైన విత్తనాలను ప్రణాళికలో పొందుపర్చారు. వెదజల్లే పద్ధతికి ప్రోత్సాహం జిల్లాలో వచ్చే వానాకాలం సాగు కోసం వరిలో వెదజల్లే పద్ధతిని ప్రోత్సహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయంలో ఖర్చు తగ్గించడంతో పాటు దిగుబడి పెంచడంలో భాగంగా ఈ పద్ధతిని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

## పత్తికి మొగ్గు చూపుతున్న రైతులు

**ఆదిలాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

ఊహించినట్టుగానే ఈ ఏడాది కూడా జిల్లాలో పత్తి పంటే అధిక విస్తీర్ణంలో సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వరికి నీటి తడులు ఎకకువగా అవసరంతో పాటు, ఖర్చుకూడా తడిసి మోపెడు అవుతోంది. కూలీల సమస్య కూడా ఉంటోంది. దీనికితోడు పత్తి తప్ప ఏ పంట వేసినా కోతుల బెడద కూడా దెబ్బతీస్తోంది. ఈ క్రమంలో రైతులు వరికన్నా పత్తి మేలని భావిస్తున్నారు. మరోవైపు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ పత్తి విత్తన కంపెనీలు ఏటా ముంచుతున్నాయి. అయితే ఈయేడు ఇప్పటినుంచే దాడులు చేసి పట్టుకుంటున్నారు. రైతులు విత్తన కొనుగోళ్లో జాగ్రత్తగా ఉండేలా హెచ్చరికలు చేస్తున్నారు. పత్తికి తోడు కంది, వరి, జొన్న, పెసర, మినుములు వంటి ఇతర పంటలను కూడా సాగు చేయవచ్చని అధికారులు సూచనలు వేశారు. ఇవి కాకుండా పోషకాహార పంటలైన చిరుధాన్యాల పంటలను సాగు చేసేందుకు ప్రత్యేకంగా చర్య లు చేపడుతున్నారు. ఇందుకు గాను వందశాతం సబ్సిడీపై రైతులకు చిరుధాన్యం విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఇవి కాకుండా ఉద్యానవనశాఖ ద్వారా వివిధ రకాల కూరగాయాల పంటలు సాగు అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా కాగజ్ నగర్, ఆసిఫాబాద్ పట్టణాలకు సమీపంలో ఉండే మండలాల్లో కూర గాయాల సాగును ప్రొత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. జిల్లాలో పత్తి సాగుకు సంబంధించి యేటా అంచనాలకు మించి ఉంటున్న నేపథ్యంలో సీజన్ ప్రారంభమైన తర్వాత సాగు విస్తీర్ణం కాస్తా అటు ఇటుగా మారే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దుక్కులు చేస్తూ తొలకరి వర్షానికే విత్తనాలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్ట పంటలను పక్కన పెడితే వరి సాగులో జీలుగ పంటను నాటి రసాయన ఎరువుగా రైతాంగం ఉపయోగిస్తున్నది. విత్తనాలను జిల్లాలోని మండలాల పరిధిలో ఉన్న అగ్రో సెంటర్లు, ప్రాథమిక సహకార సంఘాలు, సీసీ ఎం ఎస్ విక్రయ కేంద్రాల్లో అందు బాటులో ఉంచారు. జిలుగ విత్తనాలను కావాలనుకునే రైతాంగం సంబంధిత మండలాలకు చెందిన వ్యవసా యాధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొని కొనుగోలు కేంద్రాల్లో రాయితీపై ఈ విత్తనాలను పొందే వీలు కల్పించారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు..వానాకాలం పంటల సాగుకు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు జిల్లా వ్యవసాయ శాఖ కసరత్తు పూర్తి చేసింది. రైతులు ఏ విత్తనం కొనుగోలు చేసినా దుకాణాల నుంచి రశీదులు తప్పకుండా తీసుకొని భద్రపరుచుకోవాలన్నారు.విత్తనాల నాణ్య తలేని కారణంగా రైతులు పంటలు నష్టపోతే ఆ రశీదుల ఆధారంగా సదరు కంపెనీలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## రోహిణీకార్తె ప్రారంభం

- **ఎండలు మండడం ఖాయం**

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

రోహిణి కార్తె శనివావారం మే25న ప్రారంభమైంది. దీని ప్రభావం శుక్రవారం నుంచే మొదలయ్యింది. జూన్ 8 వరకూ ఉంటుంది. దాదాపు 15 రోజుల పాటూ ఎండలు మండి పోనున్నాయి. నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తొలి రోజుల్లో కొద్దికొద్దిగా పెరిగి ఉగాది నుండివేసవితాపం పెరుగుతుంది. దిన దిన ప్రవర్ధనమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడు. రోహిణి కార్తె 15 రోజుల్లో సూర్యుడి తీవ్రత తారాస్థాయికి చేరి ఆ తర్వాత నుంచి మళ్లీ నెమ్మదిగా తగ్గుతూ ఉంటుంది. రోహిణి తరవాత మృగశర కార్తె ఆరంభం అవుతుంది. వర్షాలు పడడంతో అప్పుడు వాతావరణం చల్లబడుతుంది. 27 నక్షత్రాలు, గ్రహాల ఆధారంగా పంచాంగాలు తయారు చేశారు. జాతకాలు నిర్ణయిస్తారు. సూర్యోదయం సమయానికి ఏ నక్షత్రం చంద్రుడికి దగ్గరగా ఉంటే ఆ రోజుకు ఆ నక్షత్రం పేరు పెట్టారు. పౌర్ణమి రోజు చంద్రుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ నెలకు ఆ పేరు పెట్టారు. కానీ తెలుగు రైతులు మాత్రం ఇవే నక్షత్రాలతో వ్యవసాయ పంచాంగం తయారు చేసుకున్నారు. ఈ నక్షత్రాలను కార్తెలు అని పిలుచుకుంటున్నారు. రైతుల లెక్కల ప్రకారం సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ కార్తె పేరు పెట్టారు. అలా సంవత్సరానికి 27 కార్తెలు. తెలుగు రైతులంతా తమ అనుభవం నుంచి సంపాదించుకున్న వ్యవసాయ విజ్ఞానాన్ని కార్తెలుగా వాటిని అందరకీ అర్థమయ్యేలా సామెతల రూపంలో అందరకీ అర్థమయ్యేలా చెప్పారు. అందులో ఒకటి రోహిణి కార్తె. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు అని నిర్ధారించారు. మామూలుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దంచికొడతాయి. అన్ని కార్తెల కన్నా రోహిణి కార్తె అంటే బంబేలెత్తిపోతారు. ఈ కార్తెలో ఎండలు మండిపోతాయని చెప్పడానికి బదులు రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయంటారు.అంటే వేడి తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో అని చెప్పడమే దీని ఉద్దేశం. వానలు సరైన సమయంలో పడితే రోహిణి కార్తెలోనే వ్యవసాయ పనులు ప్రారంభం అవుతాయి. దీంతో రైతులు పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తారు. రోళ్లు పగిలే ఎండలతో ఉక్కిరిబిక్కిరి చేసి రోహిణి కార్తెతో ఎండాకాలం అంతమైపోతుంది. దీని తరువాత ఒక్కో కార్తె వస్తూ ఉంటాయి. ఇలా వ్యవసాయ దారాలు ఒక్కో కార్తెలో ఒక్కో రకమైన వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఎండలు మండే రోహిణి కార్తెలో పశువులు, పక్షులకు తాగేందుకు ఎక్కడిక్కకడ నీళ్లతొట్టెలు ఏర్పాటు చేయడం చాలా మంచిది. మీరు ప్రత్యేకంగా ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు..కనీసం మీ ఇంటి చుట్టుపక్కలైనా మూగజీవాలకు నీళ్లు అందించండి. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల కూడా మీకున్న గ్రహదోషాల నుంచి విముక్తి లభిస్తుందని చెబుతారు పండితులు.

## కెసిఆర్ ముందుచూపునకు యాదాద్రి థర్మల పవర్ నిదర్శనం: కెటిఆర్

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

నల్గొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో రెండు యూనిట్ల బాయిలర్ లైట్ గురించి పంచుకోవడం ఆనందంగా ఉందని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ముందు చూపునకు యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ అద్భుతమైన ఉదాహరణ అని ఆయన ఎక్స్(ట్విటర్)లో పోస్టు పెట్టారు. 'మన దేశంలో 4 వేల మెగావాట్లతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అతిపెద్ద థర్మల్ ప్లాంట్ ఇదన్నారు.. గత భారాస ప్రభుత్వం దీని నిర్వహణను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. దీని అంచనా విలువ సుమారుగా రూ.20,400 కోట్లు. మన దేశ చరిత్రలో ఇది అసామాన్య విజయగాథ అని పేర్కొన్నారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్
People's Motivation

ఆదివారం | మే | 26 | 2024



# ఉచిత బస్సు తప్ప ఒక్క హామీ నెరవేర్చలే

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**వరంగల్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

అరచేతికి తేనె పూసి మోచేత్తో సీఎం రేవంత్‌రెడ్డి నాకమంటున్నాడు. 420 మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ఉచిత బస్సు తప్పా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ఒక్క జాబు క్యాలెండర్ లేదన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు.మూడు వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో నాలుగు లక్షల మందికి పైగా పట్టభద్రులు ఉన్నారు. పట్టభద్రులే నాలుగు కోట్ల ప్రజలకు గొంతుక కావాలన్నారు. మూడు జిల్లాలు చైతన్యానికి ప్రతీక అని ప్రశంసించారు. రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజారాజ్యం పేరుతో పైసల రాజ్యాన్ని నిర్మించుకున్న రేవంత్ రెడ్డికేసీర్ సంక్షేమ పథకాలకు కోత పెట్టారని విమర్శించారు. తీన్మార్ మల్లన్నవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలన్నారు. రేవంత్ రెడ్డి దురహంకారాన్ని గద్దెదించినందుకు ఈ ఎన్నికలు గుణపాఠం కావాలన్నారు. కాకతీయ కళాతోరణం చార్మినార్ తీసేస్తా అన్న రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. రాకేష్ రెడ్డిని గెలిపిస్తేనే జాబ్ క్యాలెండర్ వస్తుంది. నిరుద్యోగ భృతి వస్తుంది. రైతులకు రైతుబంధు రైతు భరోసా వస్తుంది. 18 ఏళ్లు నిండిన అమ్మాయిలకు స్కూటీలు వస్తాయన్నారు.

## మైసూర్‌లో మోడీ హోటల్ బిల్లు వ్యవహారం

- బిల్లు చెల్లింపులో రాష్ట్రం, కేంద్రం మధ్య వివాదం
- బిల్లు చెల్లించకుంటే చర్యలు తప్పవని హోటల్ హెచ్చరిక

**మైసూర్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

ప్రధాని మోడీ హోటల్‌లో బస చేసినందుకు గాను చెల్లించాల్సిన 80 లక్షల రూపాయల బిల్లు వ్యవహారం వివాదంగా మారింది. అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్రం వీటిని చెల్లించకపోవడంతో చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మైసూర్ రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ యాజమాన్యం బెదిరింపులకు దిగింది. వివరాల్లోకి వెళితే.. ప్రధాని మోడీ గతేడాది ఏప్రిల్ నెలలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ), పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ (ఎంఓఇఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 50 సంవత్సరాల ప్రాజెక్టు టైగర్ ఈవెంట్ మైసూర్‌లో జరిగింది. ఈ కార్యక్రమం ఏప్రిల్ 9 నుంచి 11 వరకు జరిగింది. ఈ ఈవెంట్‌ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోడీ మైసూర్‌కి వచ్చి అక్కడ ఉన్న రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో బస చేశారు. దీనికిగానూ రూ. 80.6 లక్షల రూపాయల బిల్ అయింది. అయితే ఈ బిల్స్‌ని హోటల్‌కి చెల్లించలేదు. ఈ బకాయిలను చెల్లించాలని కర్ణాటక ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్ లైఫ్).. న్యూఢిల్లీ ఎన్‌టిసిఎ డప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కి లేఖ రాసింది. అయితే ఈ హోటల్ బకాయిలను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఎన్‌టిసిఎ తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 12న లేఖ రాసింది. అయితే బకాయిలు చెల్లించక పోవడంతో మరోసారి మార్చి 22వ తేదీన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ (పిసిసిఎఫ్) ప్రిన్సిపల్ సుభాష్ కె. మల్ఖేడే ఎన్‌టిసిఎకు లేఖ రాశారు. సుభాష్ రాసిన లేఖకు సంబంధించి ఎన్‌టిసిఎ సమాధానం ఇవ్వలేదు. ఆ తర్వాత 'ఏడాది గడిచినా హోటల్‌లో బస చేసినందుకు బిల్లు చెల్లించలేదు' అని మే 21న ఈ హోటల్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చీఫ్ బసవరాజుకు లేఖ రాశారు. బకాయిలు సరైన సమయంలో చెల్లించనందుగాను 12.09 లక్షలు, మొత్తం డబ్బు సంవత్సరానికి 18 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని బ్లూ ప్లాజా యాజమాన్యం లేఖలో పేర్కొంది. ఈ బకాయిల్ని ఈ ఏడాది జూన్ 1వ తేదీ లోపు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటల్ యాజమాన్యం బెదిరించింది. అయితే ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందన్న కారణంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఈ హోటల్‌కి చెల్లించే బకాయిల్ని చెల్లించేందుకు తిరస్కరించిందని ఫారెస్ట్ చీఫ్ బసవరాజు అన్నారు.

## అజ్ఞాతం వీడని పిన్నెల్లి

- రెంటచింతతలో హత్యాయత్నం కేసు నమోదు

**అమరావతి,మే25(పీపుల్స్ మోటివేషన్):**

వైసీపీ నేత, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంకా అజ్ఞాతంలోనే కొనసాగుతున్నారు. ఈవీఎంల ధ్వంసం కేసులో జూన్6 వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించినప్పటికీ ఎమ్మెల్యే పిన్నెల్లి మాత్రం ఇంకా బయటకురాలేదు. ఓవైపు రామకృష్ణారెడ్డి తప్పించుకు తిరుగుతుంటే.. మరోవైపు ఆయన అరాచకాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. తాజాగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. ముందే విషయం తెలుసుకున్న పిన్నెల్లి అజ్ఞాతంలోనే ఉండిపోయారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఓవైపు తాను పారిపోలేదంటూ ప్రగల్భాలు పలికిన పిన్నెల్లి ప్రస్తుతం ఎక్కడ దాక్కున్నారనేది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చినా పిన్నెల్లి బయటకు రాకపోవడంపై ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల సమయంలో అతడి అరాచకాలు బయటకు వస్తుండటంతోనే భయపడి ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీసీ 307 కింద పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు నమోదుకావడంతో.. ఈకేసులు అరెస్ట్ అయ్యే అవకాశం ఉందన్న అనుమానంతోనే ఆయన బయటకు రాకపోయిఉండొచ్చనే చర్చ నడుస్తోంది. పాల్వాయి గేట్ గ్రామంలోని పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా ఉన్న నంబూరు శేషగిరిరావుపై పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు దాడిచేసిన ఘటనపై రెంటచింతట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదుచేశారు. పిన్నెల్లి ప్రోద్భలంతోనే తనపై చంపేందుకు ప్రయత్నించారని శేషగిరిరావు పోలీసులకు 161 స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతో కోర్ట్‌లో మెమో ఫైల్ చేసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ముందస్తు బెయిల్ ఇస్తూ హైకోర్టు పలు ఆంక్షలు విధించింది. మాచర్ల వెళ్లొద్దని, నరసరావుపేటలోనే ఉండాలని ఆదేశించింది. కోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అజ్ఞాతంలోనే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం వరకు నరసరావుపేటలో ఆయన కనిపించలేదు. హత్యాయత్నం కేసు పెడుతున్నారని ముందే తెలుసుకుని పరారయ్యారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దేశంలోనే ఉన్నారా.. విదేశాలకు వెళ్లిపోయారా అని పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

## వైసిపి నేత దారుణ హత్య

**మదనపల్లె,మే25(పీపుల్స్ మోటివేషన్):**

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం శ్రీవారినగర్‌లో వైసిపి నాయకుడు పుంగనూరు శేషాద్రి దారుణ హత్యకు గురయ్యారు. శేషాద్రి ఇంట్లోకి దూరిన దుండగులు కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేయడంతో శేషాద్రి రక్తపుమడుగులో కుప్పకూలారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. దుండగులు పరారీ కాగా.. వారిని పట్టుకునే పనిలో పోలీసులు నిమగమయ్యారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## నకిలీ క్లినిక్‌లపై దాడులు

- పలువురు వైద్యులపై కేసులు

**హైదరాబాద్,మే25(పీపుల్స్ మోటివేషన్):**

ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ వైద్య మండలి హెచ్చరించింది. ఈ మేరకు హైదరాబాద్, మేడ్చల్ పరిధిలో పలు క్లినిక్‌లపై అధికారులు దాడులు నిర్వహించి నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేశారు. అనుమతుల లేకుండా నిర్వహిస్తున్న పలు క్లినిక్‌లను సీజ్ చేశారు. ఐడీపీఎల్, చింతల్, షాపూర్ నగర్‌లో అధికారులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసి పేషెంట్లకు వైద్యం చేస్తున్న క్లినిక్‌లను గుర్తించి సీజ్ చేశారు. అదే క్లినిక్‌లలో డయాగ్నొస్టిక్ సెంటర్లు, మెడికల్ షాపులు ఏర్పాటు చేసి అందినకాడికి దోచుకుంటున్నట్లు పేర్కొన్నారు. సోదాల్లో 50మందికి పైగా నకిలీ డాక్టర్లు పట్టుపడడంతో అధికారులు ఖంగుతిన్నారు. యాంటీబయాటిక్స్ మందులను సైతం పేషెంట్లకు నకిలీ డాక్టర్లు అందిస్తున్నట్లు గుర్తించారు. పట్టుపడిన డాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడి ప్రజల ప్రాణలతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కాంబోడియాలో చిక్కుకున్న తెలుగువారు

- సైబర్ నేరస్థుల ఉచ్చు నుంచి కాపాడాలి
- కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి

**అమరావతి,మే25(పీపుల్స్ మోటివేషన్):**

కాంబోడియాలో చిక్కుకున్న తెలుగు యువతను కాపాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మానవ అక్రమ రవాణాకు ఏపీ కేంద్రంగా మారడం ఆందోళనకరమని ఆయన ఎక్స్(ట్విటర్) వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 150మందిని స్వదేశానికి తీసుకొచ్చేలా సహాయపడాలని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల పేరుతో రాష్ట్ర యువతను అక్రమంగా కాంబోడియా తరలించి సైబర్ నేరాల ఉచ్చులోకి నెట్టారన్నారు. యువతను నాశనం చేస్తున్న నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యువత ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో నిరాశలో కూరుకుపోతున్నారు. ఇదే అదునుగా మంచి జీతం, విదేశాల్లో ఉద్యోగాలంటూ కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారు. ఇదే తరహాలో కాంబోడియా సైబర్ నేరగాళ్ల వలకు దేశ యువత చిక్కారు. సుమారు 5వేల మంది యువత వారి చేతిలో చిక్కినట్లు తెలుస్తోంది. అందులో 150మంది తెలుగు యువత ఉన్నారు. నిరుద్యోగులను కాంబోడియా తీసుకువెళ్లిన ఏజెంట్లు వారిని సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. వారిని బందీలుగా చేసుకుని చిత్రహింసలకు గురిచేస్తూ వారితో సైబర్ నేరాలు చేయిస్తున్నారు. నేరాలకు పాల్పడకపోతే ఆహారం, మంచి నీళ్లు ఇవ్వకుండా చీకటి గదిలో బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. త్వరితగతిన చర్యలు చేపట్టి బాధితులను త్వరగా స్వదేశానికి తరలించాలని ఎక్స్ వేదికగా చంద్రబాబు కేంద్రాన్ని కోరారు.

## భద్రాచలంలో భారీగా గంజాయి పట్టివేత

**భద్రాచలం,మే25(పీపుల్స్ మోటివేషన్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో భారీగా గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనంలో తరలిస్తున్న 3.30 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కేరళలో కుండపోత వర్షం

- పలు ప్రధాన నగరాలు జలమయం

**తిరువనంతపురం,మే25(పీపుల్స్ మోటివేషన్):**

కేరళలో కుండపోత వాన కురుస్తోంది. గత రెండు రోజులుగా కేరళలో వానలు ముంచెత్తుతున్నాయి. దీంతో తిరువనంతపురం, కొచ్చి, త్రిస్సూర్, కోజికోడ్, ఎర్నాకులం, పతనంతిట్ట, అలప్పుజా, కొట్టాయం, ఇడుక్కి, పాలక్కాడ్, మలప్పురం, కోజికోడ్, వయనాడ్ సహా పలు ప్రధాన నగరాలు పూర్తిగా జలదిగ్బంధమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఏడు జిల్లాలకు శనివారం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తిరువనంతపురం, కొల్లాం, అలప్పుజా, ఎర్నాకులం, కోజికోడ్, కన్నూర్, కాసర్‌గోడ్ జిల్లాలకు ఐఎండీ ఎల్లో హెచ్చరికలు ఇచ్చింది. ఈ జిల్లాల్లో 6 సెంటీమీటర్ల నుంచి 11 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 11 మరణాలు నమోదైనట్లు రాష్ట్ర రెవెన్యూ మంత్రి కె.రాజన్ తెలిపారు. మే 9 నుంచి 23 వరకూ ఈ మరణాలు నమోదైనట్లు చెప్పారు. 11 మందిలో ఆరుగురు నీటిలో గల్లంతై మరణించగా.. క్వారీ ప్రమాదంలో ఇద్దరు, పిడుగుబాటుకు ఇద్దరు, ఇల్లు కూలి ఒకరు మరణించినట్లు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నీటి ప్రవాహాలు, తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

## బెంగళూరు రేవ్ పార్టీ కేసులో మరో కీలక పరిణామం

ప్రధాన నిందితుడు వాసు ముఖ్య అనుచరుడు అరుణ్ అరెస్ట్

**బెంగళూరు,మే25(పీపుల్స్ మోటివేషన్):**

బెంగళూరు రేవ్ పార్టీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రేవ్ పార్టీ కేసులో ప్రధాన నిందితుడు వాసు ముఖ్య అనుచరుడు, ఈ కేసులో ఏ2గా ఉన్న అరుణ్ కుమార్‌ను బెంగళూరు క్రైం బ్యాచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన అరుణ్ కుమార్ ఈ రేవ్ పార్టీలో ఏ2గా ఉన్నాడు. బర్త్ డే పార్టీ నిర్వహించిన వాసుకు అరుణ్ ముఖ్య అనుచరుడు. కాగా, అరుణ్ కుమార్ బెంగళూరులో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అలాగే, రేవ్ పార్టీలకు కూడా ప్లాన్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. దీంతో, అరుణ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా బెంగళూరులోని బీఆర్ ఫామ్ హౌస్ యజమాని గోపాల్ రెడ్డికి కూడా సీసీబీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. సోమవారం విచారణకు రావాలని ఆదేశించారు. రేవ్ పార్టీపై పోలీసులు ఆకస్మిక దాడి చేసిన సమయంలో అక్కడ నుంచి పారిపోయిన పూర్ణారెడ్డి అనే వ్యక్తి కోసం కూడా పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. బెంగళూరు రేవ్ పార్టీకి వచ్చిన వారిలో 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ తీసుకున్న వారిలో టాలీవుడ్ నటి హేమా, ఆషీరారు కూడా ఉన్నారు. వీరి బ్లడ్ శాంపిల్స్‌లో డ్రగ్స్ తీసుకున్నట్టు ఆనవాళ్లను గుర్తించిన సంగతి విదితమే. మిగతా వారి పేర్లను కూడా పోలీసులు ప్రకటించాల్సి ఉంది

## బెంగళూరు రేవ్ పార్టీ కేసు

- నటి హేమకు బెంగళూరు పోలీసుల నోటీసులు
- సోమవారం విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

**బెంగళూరు,మే25(పీపుల్స్ మోటివేషన్):**


బెంగళూరు రేవ్ పార్టీ కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఘటనపై మొత్తం 8 మందికి ఒకేసారి సీసీబీ పోలీసులు నోటీసులు జారీచేయడం జరిగింది. ఇందులో టాలీవుడ్ నటి హేమ కూడా ఉన్నారు. రక్త నమూనాలలో డ్రగ్స్ తీసుకున్నారని తేలిన వారికి సీసీబీ నోటీసులు జారీచేసింది. సోమవారం ఉదయం 10 గంటలకు బెంగళూరు పోలీసుల ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో సీసీబీ స్పష్టంగా పేర్కొన్నది. కాగా.. రేవ్ పార్టీలో పట్టుబడిన 101 మంది బ్లడ్ శాంపిల్స్ పరీక్షలు చేయగా.. 86 మందికి రక్త నమూనాలలో డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలిన సంగతి తెలిసిందే. ఇందులో 59 మంది పురుషులు, 27 మంది మహిళలు ఉన్నారు. పార్టీలో ఉన్న 30 మందిలో 27 మంది మహిళలు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ కావడం గమనార్హం. డ్రగ్స్ తీసుకున్న వారందరికీ సీసీబీ పోలీసులు నోటీసులు పంపుతున్నారు. పాజిటివ్ వచ్చిన వారందరికీ విడతల వారీగా నోటీసులు ఇవ్వడం జరుగుతోంది. తొలి విడతలో 8 మందికి బెంగళూరు సీసీబీ నోటీసులు జారీ చేసింది. రేవ్ పార్టీలో పాల్గొన్న తెలుగు వారందరికీ పాజిటివ్ అని తేలింది. పాజిటివ్ వచ్చిన వారిలో నటి హేమతో పాటు ఆషీరాయ్, పార్టీ నిర్వహించిన వాసుతో పాటు పలువురు ఉన్నారు. అబ్బే.. తాను రేవ్ పార్టీలోకి పోలేదని హైదరాబాద్ ఫామ్‌హౌస్‌లోని ఓ వీడియో.. ఆ మరుసటి రోజు పచ్చడి చేస్తున్నట్లు మరో వీడియో రిలీజ్ చేసింది హేమ. హేమ ఫొటోను బెంగళూరు పోలీసులు రిలీజ్ చేయడం సీన్ మొత్తం రివర్సయ్యింది. కృష్ణవేణి పేరుతో నటి హేమ పార్టీకి హాజరైంది. పోలీసు రికార్డుల్లోనూ హేమ పేరు కృష్ణవేణిగా నమోదు చేయడం జరిగింది. అయితే.. హేమను బాధితురాలిగా పరిగణించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## చెరువులో విషప్రయోగం..చేపలు మృతి

**సూర్యాపేట,మే25(పీపుల్స్ మోటివేషన్):**

చెరువులో విష ప్రయోగం చేయడంతో భారీగా చేపలు మృతి చెందాయి. ఈ సంఘటన సూర్యాపేటజిల్లాలో చోటు చేసుకుంది. సూర్యాపేట పట్టణ పరిధి కుడకుడ 1వ వార్డులోని గుండ్లకుంట చెరువులో విష ప్రయోగం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు క్రిమిసహారక మందు కలపడంతో పెద్ద ఎత్తున చనిపోయిన చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



## జిమ్ డ్రెస్‌లో ఫోటోలు ఇష్టం ఉండదు

మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో జాన్వీ బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తన తాజా సినిమా 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. తనకు చరిత్ర అంటే ఎంతో ఆసక్తి అని చెప్పిన జాన్వీ.. బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీల గురించి మాట్లాడారు. 'ఈ ఇద్దరి గురించి వినడం, మాట్లాడటం నాకెంతో ఇష్టం. వీళ్లు మన సమాజానికి ఎంతో సాయం చేశారు. ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. అందుకే ఈ ఇద్దరికీ సంబంధించిన ఏ అంశమైనా నాకు ఆసక్తిగానే ఉంటుంది. కులాలపై అంబేద్కర్ దృక్కోణం ముందునుంచీ చాలా కఠినంగానే ఉండేది. కాలక్రమేణా గాంధీ దాన్ని మారుస్తూ వచ్చారు. మన సమాజంలో కుల సమస్య అనేది ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. కులంపై మూడో వ్యక్తి అభిప్రాయం.. ఆ జీవితాన్ని అనుభవిస్తున్న వారి అభిప్రాయానికి మధ్య చాలా తేడా ఉంటుంది' అని చెప్పారు. ఇదే ఇంటర్వ్యూలో తన ఫొటోల గురించి జాన్వీ మాట్లాడుతూ.. 'సెలబ్రిటీల తాజా ఫొటోల కోసం అభిమానులు ఎప్పుడూ ఎదురుచూస్తుంటారు. అందుకే తారలు కనిపించగానే ఫొటోగ్రాఫర్లు కెమెరాలతో క్లిక్‌మని పిస్తుంటారు. నేను ఈ సినిమా ప్రమోషన్స్ కోసం 25సార్లు విమానంలో ప్రయాణించా.. విమానాశ్రయానికి వెళ్లేసరికే ఫొటోగ్రాఫర్లు సిద్ధంగా ఉంటారు. ఇక సినీతారల కోసం ఫొటోగ్రాఫర్లు ఎదురుచూసే మరో ప్రదేశం జిమ్. జిమ్ బయట సెలబ్రిటీలను చాలామంది ఫొటోలు తీస్తుంటారు. నన్ను అలా తీయొద్దని చాలాసార్లు అభ్యర్థించాను. ఎందుకంటే జిమ్ చేసే సమయంలో బిగుతుగా ఉండే దుస్తులు వేసుకుంటాను. ఆ దుస్తుల్లో తీసిన ఫొటోలు వైరలైతే నాకు అలాంటి డ్రెస్‌లే ఇష్టమని అందరూ భావిస్తారు. అందుకే జిమ్ బయట ఫొటోలు దిగడం నాకు నచ్చదు' అని చెప్పారు.

# కేన్స్‌లో బాలీవుడ్ సందడి

ఉత్తమనటిగా అనసూయ సేన్‌గుప్తాకు అవార్డు


ఫ్రాన్స్‌లో 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన డ్రెస్‌లను ధరించి రెడ్ కార్పెట్‌పై యలు పోతున్నారు. మరోవైపు ఈ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో మలయాళీ చిత్రం 'ఆల్ వీ ఇమాజైన్ యాజ్ లైట్' పోటీలో నిలిచింది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ భారతీయ చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీలో నిలవడం విశేషం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ముఖ్య విభాగమైన 'పామ్ డి ఓర్' అవార్డుల కేటగిరీలో ఈ సినిమా పోటీ పడుతున్నది. ఇదిలావుంటే తాజాగా భారతీయ నటి అనసూయ సేన్‌గుప్తా చరిత్ర సృష్టించింది. ఇందులో మరో ముఖ్య విభాగమైన 'అన్ స్టర్గ÷యిన్ రిగార్డ్'కేటగిరీలో ఉత్తమ నటిగా అనసూయ అవార్డు అందుకుంది. 'ది షేమ్‌లెస్ అనే చిత్రానికి ఆమె ఈ అవార్డు అందుకోగా.. ఈ ప్రతిష్ఠాత్మక ఫిల్మ్‌ఫెస్టివల్‌లో అవార్డు గెలిచిన తొలి భారతీయురాలిగా అరుదైన ఘనత సాధించింది. ఇక 'ది షేమ్‌లెస్ ' చిత్ర విషయానికి వస్తే.. ఈ సినిమాను బల్గేరియన్



దర్శకుడు కాన్‌స్టాంటిన్ బొజనోవ్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో అనసూయ 'రేణుక' అనే వేశ్య పాత్ర ను పోషించింది. దేశ రాజధాని ఢిల్లీలో గల ఓ బ్రోతల్ హౌస్‌లో ఉన్న రేణుక అనుకోకుండా అక్కడకు వచ్చిన పోలీసును చంపి పారిపోతుంది. ఇక అక్కడ నుంచి దూరంగా పారిపోయిన రేణుక ఒక సెక్స్ వర్కర్ల కమ్యూనిటీలో ఆశ్రయం పొందుతుంది. అక్కడనే ఒక అమ్మాయితో ప్రేమలో పడుతుంది. ఈ క్రమంలోనే వారికి ఎదురైన అడ్డంకులు ఏంటి. చివరికి ఎం జరిగింది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# జియో చేతికి భగవంత్ కేసరి హిందీవర్షన్

నందమూరి నటసింహం బాలయ్య నటించిన 'భగవంత్ కేసరి' చిత్రం గత ఏడాది దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కాజల్ కథానాయికగా నటించింది. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల ముఖ్య పాత్రలో నటించింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించాడు. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ విలన్‌గా నటించాడు. ఈ మూవీని సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించగా.. ఈ మూవీ 70 కోట్లకు పైగా షేర్ ని అలాగే 132 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఈ సినిమాలో తెలంగాణ యాసలో బాలయ్య చెప్పే డైలాగ్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. థియేటర్స్‌లోనే కాదు ఓటీటీలో కూడా మంచి రేటింగ్‌తో అదరగొట్టింది. తాజాగా ఈ బిగ్గెస్ట్ యాక్షన్ మూవీ హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ రైట్స్‌ను జియో సినిమా సొంతం చేసుకుంది. ప్రస్తుతం హిందీ వెర్షన్ లో స్ట్రీమింగ్ అవుతోంది.



# ధనుష్ స్వీయ సినిమా రాయన్

తమిళ నటుడు ధనుష్ ప్రస్తుతం వరుస సినిమాలతో లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే ఈ ఏడాది సంక్రాంతికి 'కెప్టెన్ మిల్లర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకున్న ఈ హీరో ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేరా అనే సినిమా చేస్తున్నాడు. ఇక ఈ సినిమా అనంతరం ధనుష్ తన 50వ సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పేరు రాయన్. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మటన్ కొట్టు రాయన్‌గా ధనుష్ లుక్ వైరల్ అయ్యింది. ఇక ఇదే సినిమాలో సందీప్ కిషన్‌తో పాటు కాళిదాస్ జయరాం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రబృందం పీచు మిఠాయి అంటూ రొమాంటిక్ పాటను విడుదల చేసింది. ఇక ఈ పాటలో సందీప్ కిషన్, అపర్ణ బాలమురళి రోమాన్స్ ఆకట్టుకునేలా ఉంది. విజయ్ ప్రకాష్, హరిప్రియ కలిసి పాడిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, ఎఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, విష్ణువిశాల్, దుషారా విజయన్, సెల్వ రాఘవన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# బుజ్జి కారును చూసి ముచ్చటపడ్డ నాగచైతన్య

ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కడ చూసినా బుజ్జి టాపిక్కే నడుస్తోంది. బుజ్జి అంటే మనిషి కాదు. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న కల్కి 2898 ఎడి' చిత్రంలో కీలక పాత్ర పోషించే కారు అది. ఇటీవల 'బుజ్జి'ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ చిత్రం కోసమే ప్రత్యేకంగా ఆ కారును డిజైన్ చేశారు. తాజాగా యంగ్ హీరో నాగచైతన్య బుజ్జిని కలిశారు. బుజ్జిని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసం 'కల్కి' టీమ్ ఓ ఈవెంట్ చేసింది. దానిలో బుజ్జితో పాటు ఎంట్రీ ఇచ్చాడు ప్రభాస్. ఎఫ్ 1 రేసింగ్‌లో ఉపయోగించే కారులాగా ఉన్న బుజ్జిని చూసి చాలామంది ఇంప్రెస్ అయ్యారు. అలా ఇంప్రెస్ అయినవారిలో నాగచైతన్య కూడా ఒకడు. అందుకే బుజ్జిని డైరెక్ట్‌గావెళ్లి చూశారు. బుజ్జితో ఒక రైడ్‌కు వెళ్లాడు. దాని తయారీని చూసి ఆశ్చర్యపోయాడు చైతూ. 'నేను ఇంకా షాక్‌లోనే ఉన్నాను. మీరు ఇంజనీరింగ్‌కు సంబంధించిన అన్ని రూల్స్‌ను బ్రేక్ చేశారు' అంటూ బుజ్జిని తయారు చేసిన టీమ్‌ను ప్రశంసించారు నాగచైతన్య. ఆయన బుజ్జిని కలవడం, దాంతో రైడ్‌కు వెళ్లడాన్ని వీడియోగా తీసి తమ సోషల్ మీడియాలో షేర్ చేసింది వైజయంతీ మూవీస్. మామూలుగా చైతూకు ముందు నుంచి కార్లంటే చాలా ఇష్టం. అందుకే ఏ స్టార్ దగ్గర లేని కొన్ని అడ్వాన్స్ మోడల్ కార్ కలెక్షన్స్ తన దగ్గర ఉన్నాయి. అలాంటి హీరో బుజ్జితో రైడ్‌కు వెళ్లిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీన్నిబట్టి చూ?స్త 'కల్కి 2898'ను ప్రమోట్ చేయడానికి మరెందరో తెలుగు స్టార్లు రంగంలోకి దిగుతారని తెలుస్తోంది. ఇప్పటికే బుజ్జికి వాయిస్ ఓవర్ చెప్పడానికి కీర్తి సురేశ్ ముందుకొచ్చింది.



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 27న విడుదలకు సిద్ధమయ్యింది. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనె, దిశా పటానీ నటించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన కీలక పాత్రధారులు. రెండ్రోజుల క్రితం అమితాబ్ బచ్చన కూడా బుజ్జి గురించి ప్రశంసల వర్షం కురిపించారు. బుజ్జి ఓ అద్భుతం అని, రోజులు గడిచిన కొద్దీ దానిని ప్రశంసిస్తూనే ఉంటారని బిగ్‌బీ ప్రశంసించారు.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com